RNI NO : TELTEL/2023/89146

Telugu Daily

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక సంపుటి :3 సంచిక:203 మంగళవారం 22 ఆగస్టు 2026 పేజీలు :8 వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి
శెనార్తి మీడియా
ఆహ్వానం పలుకుతుంది
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలో సంప్రదించగలరు.

77309 83966 98491 98098

## జిన్‌పింగ్ భారత్‌కు.. ఏడేళ్ల తర్వాత రాక?

- సెప్టెంబర్ 12, 13న ఢిల్లీలో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలు
- భారీ బృందంతో జిన్‌పింగ్ వచ్చే అవకాశం
- పుతిన్‌తో పాటు చైనా అధ్యక్షుడి పర్యటనపై ఆసక్తి
- భారత్-చైనా సంబంధాల్లో మార్పులకు సంకేతమంటున్న రాయిటర్స్

4



## కాక్రోచ్ జనతా పార్టీ మరో ఉద్యమానికి సిద్ధం

- సెప్టెంబర్ 5న ఢిల్లీలో శాంతియుత మార్చ్
- ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ
- కేంద్రం హామీలు అమలు చేయలేదని సీజేపీ ఆరోపణ
- నీట్ బాధిత విద్యార్థుల కుటుంబాల ఆధ్వర్యంలో నిరసన



4

## సింగరేణిని లాభాల బాటలో నడిపిస్తాం

- ఉజ్వల భవిష్యత్తు కోసం క్రిటికల్ మినరల్స్ వైపు అడుగులు
- బొగ్గుకే పరిమితం కాక బంగారం, లిథియం మైనింగ్‌లోకి..
- ఎన్‌టీపీసీ స్థాయిలో సింగరేణిని నిలబెట్టడమే మా ధ్యేయం
- డిప్యూటీ సీఎం భట్టి
- భట్టి నాయకత్వంలో సింగరేణి మరింత బలోపేతం

3





## జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు ఫుల్!

- మద్యం బ్రాండ్లకు నోటిఫికేషన్‌పై హరీష్‌రావు ఫైర్

2



## శాసనసభ కమిటీలదే కీలక పాత్ర

- లెజిస్లేచర్ మైనారిటీల సంక్షేమ కమిటీ, ఎస్సీ సంక్షేమ కమిటీ సమావేశం

2

# ప్రత్యర్థులపైనే ప్రతాపం అసమ్మతి వర్గంపై ఆచూతూచి ముందుకు..



- ముప్పేట దాడిని ఎదుర్కొంటున్న సీఎం
- రేవంత్‌నే లక్ష్యంగా విపక్షాల వ్యూహాలు
- సొంత పార్టీలో పెరుగుతున్న అసమ్మతి
- సీనియర్ల అసంతృప్తి సీఎంకు సవాలు
- ఆచితూచి అడుగులు వేస్తున్న రేవంత్

**తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్, బీజేపీ వంటి ప్రత్యర్థి పార్టీల నుంచి తీవ్ర రాజకీయ దాడి కొనసాగుతున్నా.. ఆయన మాత్రం దూకుడైన శైలితో వాటిని ఎదుర్కొంటున్నారు. అయితే బయట ప్రత్యర్థులను ధీటుగా ఎదుర్కొంటున్న రేవంత్‌కు సొంత పార్టీలోని అసమ్మతి వర్గం నుంచి వస్తున్న సవాళ్లు కొత్త చిక్కులు తెస్తున్నాయి.**



**హైదరాబాద్, ఆగస్టు 24:**
కాంగ్రెస్‌లోని అసమ్మతిపై మాత్రం ఆచితూచి అడుగులు వేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ప్రత్యర్థులే ప్రధాన లక్ష్యం**

తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీ రాజకీయ విమర్శలను కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్రీకరిస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయాలపై విమర్శలు చేయడంతో పాటు రేవంత్ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ప్రతిపక్షాలు వ్యూహాలు రచిస్తున్నాయి. అయినప్పటికీ సీఎం వెనక్కి తగ్గకుండా తనదైన దూకుడుతో వాటికి సమాధానం ఇస్తున్నారు. ఒక అధికార నాయకుడిని లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థి శక్తులు ఏకకాలంలో దాడి చేయడం ఆయనకు రాష్ట్ర రాజకీయాల్లో ఉన్న ప్రాధాన్యతకు సంకేతంగా కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి.

**సొంత గూటిలోనే అసమ్మతి**

రేవంత్‌కు అసలు సవాలు మాత్రం కాంగ్రెస్‌లోనే ఎదురవుతోంది. మంత్రి కొండా సురేఖ కుమార్తె

మిగతా 2వ పేజీలో..

## రాష్ట్రంలో పెట్టుబడులను అడ్డుకునే కుట్ర

- గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా మోదీ
- సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ప్రధాని వ్యవహారం
- అమెరికా టూర్ రద్దును ఊరికే వొదలబోం
- పార్లమెంటులో కాంగ్రెస్ ఖచ్చితంగా నిలదీస్తుంది
- నన్ను అడ్డుకున్నా.. నా లక్ష్యాన్ని అడ్డుకోలేరు
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ మండిపాటు



**హైదరాబాద్, ఆగస్ట్ 24 :**
పెట్టుబడుల సాధన కోసమే విదేశీ పర్యటనకు సంకల్పించామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే, దురుద్దేశపూర్వకంగా తన అమెరికా పర్యటనను కేంద్రం తిరస్కరించిం దని ఆరోపించారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరించాలనేదే సమాఖ్య స్ఫూర్తి అని తెలిపారు. అందుకు విరుద్ధంగా

మిగతా 2వ పేజీలో..

## సెప్టెంబరు 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- నీటిపారుదల ప్రాజెక్టులకు భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలి
- ప్రజాప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ సమావేశం

2

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- బీజేపీ ఆధ్వర్యంలో 'ఫీజుల బకాయి – బీజేపీ లడాయి'
- రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు 48 గంటల దీక్ష ప్రారంభం

**హైదరాబాద్, ఆగస్టు 24 :**
రాష్ట్రంలోని సుమారు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును కాలరాస్తూ, విద్యావ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరులకు నిరసనగా బీజేపీ పోరుబాట పట్టింది. రూ.15వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ 'ఫీజుల బకాయి బీజేపీ లడాయి' పేరిట బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు చేపట్టిన 48 గంటల నిరాహార దీక్ష పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ప్రారంభమైంది. ప్రజాస్వామ్య బద్ధంగా

మిగతా 2వ పేజీలో..






## 22ఏపై దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

- అబద్ధాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు
- ఫాస్ట్ ట్రాక్‌లో దరఖాస్తులు పరిష్కారం.. 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తి
- అక్రమార్కులపై క్రిమినల్ కేసులు
- యూఎల్‌సీపై త్వరలో విధానపరమైన నిర్ణయం
- ప్రధాన ప్రతిపక్షం కోరితే సీఎస్-7, సీఎస్-14 భూ వ్యవహారంపై 'సెట్' దర్యాప్తు
- మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి

3

## అటవీ శాఖలో పలువురు అధికారుల డిప్యూటేషన్లు రద్దు

- పీసీసీఎఫ్ కార్యాలయంలో వెంటనే రిపోర్ట్ చేయాలని ఆదేశం
- మంత్రి సురేఖకు తెలియకుండానే జీవో వెలువడిందంటూ కలకలం

3

## కల్యాణలక్ష్మి కేసులో సర్కారుకు స్వల్ప ఊరట

- దివ్యాంగ వధువులకు సాయం కొనసాగించాలని హైకోర్టు ఆదేశం

2





## అధిష్ఠానం పరిశీలనలో సుష్మిత వ్యవహారం

- కాంగ్రెస్ పెద్దలు తీసుకునే నిర్ణయం కోసం వేచిచూస్తున్నాం
- సోషల్ మీడియాతో బతికేస్తున్న కేటీఆర్
- మెదక్ లో కాంగ్రెస్ సమావేశంలో టీపీసీసీ చీఫ్

**మెదక్, ఆగస్ట్ 24 :**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుష్మిత చేసిన వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ స్పందించిన తీరు కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. సురేఖపై

మిగతా 3వ పేజీలో..

# ప్రత్యర్థులపైనే ప్రతాపం అసమ్మతి వర్గంపై ఆచూతూచి ముందుకు..

మొదటిపేజీ తరువాయి

కొండా సుస్మితా పటేల్ ముఖ్యమంత్రి, ఆయన కుటుంబంపై తీవ్ర ఆరోపణలు చేయడం పార్టీలో కలకలం రేపింది. పరకాల నియోజకవర్గం విషయంలోనూ సీఎం నిర్ణయాన్ని సుస్మిత బహిరంగంగా సవాలు చేయడం వివాదాన్ని మరింత పెంచింది. ఈ వ్యవహారంపై కొండా సురేఖకు పీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసు జారీ చేయడం పరిస్థితి తీవ్రతను స్పష్టం చేసింది.

**సీనియర్ల అసంతృప్తి**

కాంగ్రెస్‌లోని సీనియర్ నేతల అసంతృప్తి కూడా రేవంత్‌కు తలనొప్పిగా మారుతోంది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, చిన్నారెడ్డి వంటి నేతలు ప్రభుత్వ వైఖరిపై బహిరంగంగా స్పందించడం పార్టీలో సమన్వయంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. సుదీర్ఘకాలంగా కాంగ్రెస్‌లో కొనసాగుతున్న నేతల రాజకీయ ప్రాధాన్యత, పదవుల ఆకాంక్షలను సమతుల్యం చేయడం సీఎంకు కఠిన పరీక్షగా మారింది. ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు ప్రాధాన్యత పెరుగుతోందనే భావన కూడా కొంతమంది సీనియర్లలో అసంతృప్తికి కారణమవుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**అసమ్మతిపై ఆచితూచి అడుగులు**

విపక్షాలపై కఠినంగా వ్యవహరించే రేవంత్.. సొంత పార్టీలోని అసమ్మతి నేతల విషయంలో మాత్రం పరిస్థితిని బట్టి అడుగులు వేస్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒకవైపు పార్టీ క్రమశిక్షణను కాపాడాల్సిన అవసరం ఉండగా.. మరోవైపు సీనియర్ నేతలను పూర్తిగా దూరం చేసుకోకుండా సమన్వయం చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. అందుకే అసమ్మతిని కట్టడి చేయడంతో పాటు నేతలను నమ్మకంలోకి తీసుకునే ప్రయత్నమే రేవంత్‌కు రాజకీయంగా ప్రయోజనకరంగా ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**రెండు వైపులా సమతుల్యం**

విపక్షాలను ఎదుర్కొనే విషయంలో రేవంత్ తన రాజకీయ బలాన్ని ఇప్పటికే ప్రదర్శిస్తున్నారు. అయితే సొంత పార్టీలో అసమ్మతిని ఎంత సమర్థంగా చక్కదిద్దుతారన్నదే ఆయన నాయకత్వానికి అసలు పరీక్ష. కఠిన చర్యలు తీసుకుంటే అసమ్మతి మరింత పెరిగే అవకాశం ఉండగా.. పూర్తిగా చూసీచూడనట్లు వ్యవహరిస్తే అది విపక్షాలకు ఆయుధంగా మారే ప్రమాదం ఉంది. దీంతో ప్రత్యర్థులపై దూకుడు.. అసమ్మతి వర్గంపై ఆచితూచి అడుగులు అనే ద్వంద్వ వ్యూహంతో రేవంత్ ముందుకు సాగాల్సిన పరిస్థితి ఏర్పడింది.



# సెప్టెంబరు 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు


హైదరాబాద్, ఆగస్టు 24 :


సెప్టెంబర్ 7వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు ఉంటాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. అందుబాటులో ఉన్న ప్రజాప్రతినిధులతో ఆయన సోమవారం సాయంత్రం సమావేశమయ్యారు. నియోజకవర్గాల పరిధిలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని, భూసేకరణపై నిర్లక్ష్యం వహిస్తే ఎప్పటికీ ప్రాజెక్టులు పూర్తి కావని అన్నారు. భూసేకరణ, ఆర్ అండ్ ఆర్, ఫారెస్టు క్లియరెన్సులకు సంబంధించి నిధులను వెంటనే మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రతీ ఒక్కరూ నియోజకవర్గ అభివృద్ధిపై ఫోకస్ పెట్టాలని సీఎం సూచించారు. ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, విప్‌లు ఆది శ్రీనివాస్, రామచంద్ర నాయక్, బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, వీర్ల పల్లి శంకర్, ప్రేమ్‌సాగర్ రావు, నవీన్ యాదవ్, మట్టా రాగమయి, మందుల సామేల్, వెడ్మ బొజ్జు, కోరం కనకయ్య, లక్ష్మీకాంతరావు, రామ్‌దాస్ నాయక్, కడియం శ్రీహరి, డాక్టర్ సంజయ్, బత్తుల లక్ష్మారెడ్డి, మనోహర్ రెడ్డి, తెల్లం వెంకట్ రావు, నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, మురళి నాయక్, యశస్విని రెడ్డి, ఎంపీలు కడియం కావ్య, రఘు వీర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య హాజరయ్యారు.

# జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు ఫుల్!

హైదరాబాద్, ఆగస్టు 24 :

రాష్ట్రంలో లక్షలాదిమంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం కళ్లుకాయలు కాచేలా ఎదురుచూస్తుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయడంలో మీనమేషాలు లెక్కిస్తోందని అసెంబ్లీలో బీఆర్ఎస్ ఉప నాయకుడు హరీష్‌రావు విమర్శించారు. కానీ 121 మద్యం బ్రాండ్ల నోటిఫికేషన్లు మాత్రం ఆఘమేఘాల మీద విడుదల చేస్తోందన్నారు. యువత భవిష్యత్తుకు భరోసా ఇచ్చే జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వని మీకు మద్యం వ్యాపారానికి మాత్రం ఇంత తొందర ఎందుకు అని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం కంటే మద్యం అమ్మకాలపైనే ప్రభుత్వానికి ఎక్కువ శ్రద్ధా అని నిలదీశారు. యువత డిగ్రీలు, పిజీలు పూర్తి చేసి జాబ్స్ కోసం ఎదురు చూస్తుంటే ప్రభుత్వం మద్యం షాపులు, బ్రాండ్లు పెంచి, డబ్బు వసూలు చేయాలని చూస్తోందన్నారు. సమయానికి యువతకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వలేని ఈ చేతగాని సర్కారు మద్యం షాపులకు, బ్రాండ్లకు మాత్రం నోటిఫికేషన్ ఇస్తున్నది అని ఎద్దేవా చేశారు. రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు మోసం.. ఫీజు రీయింబర్స్ మెంట్ మోసం.. రాజీవ్ యువ వికాసం.. వికసించక ముందే వాడిపోయింది.. మేనిఫెస్టోలో చెప్పిన హామీలకు గతి లేకుండా పోయింది.. రేవంత్ పగ.. యువత దగా అన్నట్లుగా తయారైంది అని వ్యాఖ్యానించారు. జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు ఫుల్.. రేవంత్ రెడ్డీ.. ఇదేనా మీరు చెప్పిన ప్రజా పాలన అని హరీష్‌రావు అడిగారు.






# రాష్ట్రంలో పెట్టుబడులను అడ్డుకునే కుట్ర

మొదటిపేజీ తరువాయి

కేంద్ర విధానాలు ఉన్నాయన్నారు. వికసిత్ భారత్ 2047లో భాగంగా తెలంగాణ రైజింగ్ 2047ను ప్రకటించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. లండన్ నుంచి తిరిగి వచ్చిన తరవాత సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ట్రిలియన్ డాలర్ల ఎకానమీ తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విదేశీ పెట్టుబడుల ఆకర్షణ ద్వారా తెలంగాణ ఆర్థిక పురోభివృద్ధి దిశగా వెళ్లాలనేదే తమ యోచన అని పేర్కొన్నారు. మోదీ ఇంకా గుజరాత్ ముఖ్యమంత్రిలానే వ్యవహరిస్తున్నారని.. దేశానికి ప్రధాన మంత్రిగా వ్యవహరించడం లేదని సీఎం విమర్శించారు. గుజరాత్ నేతలు తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విరుచుకుపడ్డారు. గుజరాత్ ఆధిపత్యానికి ఇదే నిదర్శనమని చెప్పుకొచ్చారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తెలంగాణ సీఎం పర్యటనకు నిరాకరించడం నాలుగు కోట్ల ప్రజలకు జరిగిన అవమానం అన్నారు. ఇది స్పష్టమైన రాజకీయ వివక్ష, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. వైబ్రెంట్ గుజరాత్ పేరుతో ఆ రాష్ట్ర సీఎం అమెరికాలో ర్యాలీలు చేశారని, పెట్టుబడుల కోసం ఎనిమిది రోజులు అక్కడ పర్యటించిన విషయాన్ని ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేశారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తమ పర్యటనను ఎందుకు అడ్డుకున్నారో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రం పదే పదే తెలంగాణ వ్యతిరేక భావజాలాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించుకొనేందుకు కుట్రలు చేశారంటూ మండిపడ్డారు. టీబీజేపీ నేతలు వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. విచక్షణ కోల్పోయి ప్రభుత్వం, తన అధికారిక పర్యటనలపై బీజేపీ నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. బీజేపీ నేతలపై ఆరోపణలు చేయదలచుకోలేదని.. ఎందుకంటే వారికి ఆ స్థాయి లేదంటూ వ్యాఖ్యానించారు. పెట్టుబడుల సాధన కోసం గతంలోనూ విదేశీ పర్యటనకు వెళ్లామని వివరించారు. దిల్లీలో ఉన్న కొందరు బీజేపీ నేతలు కేంద్రాన్ని తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. తన అధికారిక పర్యటనపై కేంద్రానికి అవాస్తవాలు చెప్పారని మండిపడ్డారు. 'మేము ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. నా పర్యటన పూర్తి వివరాలు కేంద్రానికి ఇచ్చాం. విద్య, క్రీడల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలని సంకల్పించాం. అమెరికా పర్యటనలో ప్రఖ్యాత యూనివర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని కేంద్రానికి చెప్పాం. రాజకీయ కారణాల వల్ల అనుమతి నిరాకరిస్తున్నట్లు కేంద్ర విదేశాంగశాఖ మాకు బదులిచ్చిందని అన్నారు. అందుకే ఇంగ్లండ్ పర్యటనకు అనుమతి ఇచ్చారు.. అమెరికా పర్యటనను ఎందుకు తిరస్కరించారని ప్రశ్నించారు. గుజరాత్ సీఎంకి అమెరికా, కెనడా పర్యటనలకు అనుమతిచ్చారు. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణ ప్రజలను అవమానించడమే. తిరస్కరణకు రాజకీయ కారణాలు చెబుతున్నారంటూ ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీబీజేపీ ఎంపీలు గుజరాత్‌ను సపోర్ట్ చేస్తున్నారా? టీబీజేపీ ఎంపీలకు తెలంగాణ అభివృద్ధి అవసరం లేదా? అని ప్రశ్నించారు. 'నా పర్యటనను అడ్డుకోవడమంటే.. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణపై వివక్ష చూపించడమే. నా పర్యటనను అడ్డుకున్నారు.. మా లక్ష్యాలను అడ్డుకోలేరు. నాది చాటుమాటు పర్యటన కాదు.. అధికారిక పర్యటన. విదేశాల్లో ఉండగా



స్పందిస్తే.. దేశద్రోహి అనేవారు. అందుకే ఇక్కడికి వచ్చి కేంద్రం వైఖరిపై మాట్లాడుతున్నా. ఏ విదేశీ పర్యటన అయినా భారత ఎంబసీ పర్యవేక్షిస్తుంది. మా పర్యటన వివరాలను వారే కేంద్రానికి తెలియజేస్తారు. ఇందులో రహస్యం ఏముంది' అని ప్రశ్నించారు. కేంద్రానికి తెలంగాణ అంటే చులకన, చిన్నచూపు అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. తన పర్యటనను అడ్డుకోవడం పూర్తిగా వివక్షే అని అన్నారు. ఈ అంశాన్ని రాహుల్, ఖర్గే పార్లమెంట్‌లో ప్రస్తావిస్తారని తెలిపారు. విదేశాంగశాఖ అధికారి బీజేపీలో చేరడం మంచిదని హితవుపలికారు. కాంగ్రెస్ సీఎంననే తన పర్యటనను అడ్డుకున్నారని ఆరోపించారు. మెట్రో సహా చాలా అంశాల్లో కేంద్రం సహకరించట్లేదన్నారు. సబ్ కా సాత్, సబ్ కా వికాస్ అంటే ఇదేనా అని ప్రశ్నించారు. మోదీకి బీజేపీ పాలిత రాష్ట్రాలు తప్ప.. ఇతర ప్రాంతాల అభివృద్ధి అవసరం లేదన్నారు. కేంద్రం వివక్షను సహించేది లేదని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్రం నన్ను అడ్డుకున్నా.. నా లక్ష్యాన్ని అడ్డుకోలేదన్నారు. డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తాం. హైదరాబాద్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తాం. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవాలని గుజరాత్ నాయకత్వం కుట్ర చేస్తోంది. మన రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడమే వారి లక్ష్యం. తెలంగాణపై గుజరాత్ ఆధిపత్యాన్ని అందరూ ఖండించాలి. ప్రధాని మోదీ గుజరాత్‌కు బ్రాండ్ అంబాసిడర్ మాదిరిగా వ్యవహరిస్తున్నారు. భారత్‌కు వచ్చే పెట్టుబడులన్నీ గుజరాత్‌కు రావాలని మోదీ చూస్తున్నారు. తెలంగాణ సీఎం పర్యటనను అడ్డుకోవడం గురించి పార్లమెంటులో లేవనెత్తుతాం. దీన్ని వదిలిపెట్టేది లేదు. మమ్దానీ న్యూయార్క్ ప్రజలు ఎన్నుకున్న మేయర్. ఆయనే అసాంఘిక శక్తికాదు కదా అని అన్నారు. నరేంద్ర మోదీ ప్రధానిగా పాక్ వెళ్లి ఆయన మిత్రుడితో కలిసి బిర్యానీ తిని రాలేదా? మేం మాత్రం పెట్టుబడుల కోసం అమెరికా వెళ్లకూడదా? మోదీ ప్రధాని అయ్యాక ప్రజాస్వామ్యం సన్నగిల్లింది. నిరంకుశత్వం పెరిగింది. మోదీ వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం.. ఆయన వైఖరితో కేంద్ర, రాష్ట్ర సంబంధాలు దెబ్బతింటున్నాయి. బీఆర్ఎస్ నేతలు హరీశ్, కేటీఆర్, కవిత పిల్లలు విదేశాల్లో చదువుకుంటున్నారు. వారికి అమెరికా పర్యటనలకు అనుమతులు వస్తున్నాయి. సీఎంగా నా పర్యటనకు మాత్రం అనుమతి ఇవ్వడంలేదు. నేనూ హార్వర్డ్ యూనివర్సిటీలో చదివాను. ఒప్పందాల విషయంలో అమెరికా నుంచి నాకు ఆహ్వానం ఉందన్నారు. విలేకరుల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# శాసనసభ కమిటీలదే కీలక పాత్ర

హైదరాబాద్, ఆగస్టు 24 :

ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభ కమిటీలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నదని, ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షిస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా చేరేలా చూడడంలో కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్‌లో శాసనమండలి (లెజిస్లేచర్) మైనారిటీల సంక్షేమ కమిటీ, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కమిటీ ప్రారంభ సమావేశం సోమవారం జరిగింది. తొలుత నూతన కమిటీ చైర్మన్లకు, సభ్యులకు చైర్మన్, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కార్యదర్శులు పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై కమిటీలు నిత్యం పర్యవేక్షిస్తూ ప్రభుత్వానికి సలహాలు సూచనలు అందించాలన్నారు. మైనారిటీల విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి వారికి అందుతున్న ప్రభుత్వ పథకాలు, నిజమైన ప్రయోజనాలను అందించేలా చూడాల్సిన బాధ్యత ఈ కమిటీపై ఉన్నదని అన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటనలతోపాటు అధికారుల ద్వారా తగు సమాచారాన్ని తెప్పించుకుని షెడ్యూ□డ□ కులాలకు సంబంధించిన పథకాల మలులో



లోటుపాట్లను సమీక్షించి ప్రభుత్వానికి తగు సూచనలు చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు అనుగుణంగా ఖర్చుపై సమగ్రంగా వివరణలను తీసుకోవాలన్నారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ తాను కూడా 2008లో షెడ్యూల్డ్ కులాల కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించానని గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర జనాభాలో 18 శాతం ఉన్న షెడ్యూల్డ్ కులాల అభ్యున్నతి, సంక్షేమం కోసం ఈ కమిటీ పనిచేస్తూ వారి ప్రాథమిక అవసరాలను గుర్తించి అందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. కమిటీ సభ్యులు తమ అనుభవం, అవగాహనతో అధికారులతో సమన్వయంతో పనిచేసి ప్రజాప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి, మైనారిటీలు, వెనుకబడిన తరగతుల అభివృద్ధికి కృషి చేస్తారని ఆశిస్తున్నానన్నారు. మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్, లెజిస్లేచర్ మైనారిటీస్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ తోట లక్ష్మీకాంతారావు, సభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్, పాయల్ శంకర్, శాసనమండలి ఎస్సీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ మేడిపల్లి సత్యం, సభ్యులు వెడ్మ బొజ్జు, కేఆర్ నాగరాజు, కవ్వంపల్లి సత్యనారాయణ, విజయుడు, శ్రీపాల్ రెడ్డి, బస్వరాజు సారయ్య, మండలి కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతిలు హాజరయ్యారు.

# కల్యాణలక్ష్మి కేసులో సర్కారుకు స్వల్ప ఊరట

హైదరాబాద్, ఆగస్ట్ 24:

హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ వధువులకు అందిస్తున్న అదనపు సాయాన్ని కొనసాగించేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వీరికి ఈ పథకాల వర్తింపుపై విధించిన స్టేను హైకోర్టు సోమవారం ఎత్తివేసింది. దివ్యాంగు లకు మినహా మిగిలిన వారికి ఈ రెండు పథకాలపై విధించిన స్టే కొనసా గుతోందని స్పష్టం చేసింది. అయితే దీనిపై వాదనలు వినిపించడానికి రా ష్ట ప్రభుత్వం రెండు వారాల గడువు కోరింది. ఈ పథకాల కింద సాధా రణ లబ్ధిదారులతో పోలిస్తే దివ్యాంగ వధువులకు 25 శాతం అదనంగా ఆర్థిక సాయం అందించేలా గతంలో ప్రభుత్వం జీవో జారీ చేసింది. సోమవారం ఈ పథకాల అమలుపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. దివ్యాంగుల హక్కుల చట్టం నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రత్యేక ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు హైకోర్టు ధర్మాసనానికి స్పష్టం చేశారు. ప్రభుత్వ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. దీంతో దివ్యాంగ వధువులకు ఈ పథకాల కొనసాగింపునకు ఆదేశించింది.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

మొదటిపేజీ తరువాయి

ధర్నా చౌక్ వద్ద దీక్ష చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతి నిరాకరించినప్పటికీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలోనే రామచందర్ రావు దీక్షకు దిగారు. ఫీజు బకాయిల సమస్య పరిష్కారమయ్యే వరకు ఈ పోరాటం ఆగదని పార్టీ స్పష్టం చేసింది. కార్యక్రమానికి విద్యార్థులు, పార్టీ శ్రేణులు భారీ ఎత్తున తరలివచ్చి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై బీజేపీ పోరాటం కొనసాగుతోందన్నారు. బీజేవైఎం ఆధ్వర్యంలో కాలేజీలకు వెళ్లి ఐదు లక్షల మంది విద్యార్థుల నుంచి సంతకాలు సేకరించామని, 'మా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మాకివ్వండి' అంటూ విద్యార్థులు సంతకాలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వంపై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారని తెలిపారు. ఫీజు బకాయిల కోసం విద్యార్థులు కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేస్తే వారిపై పోలీసులు దురుసుగా వ్యవహరించడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక□ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఒక్కటే కాదు.. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ భ్రష్టుపట్టిపోయిందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే విద్యాశాఖను నిర్వహిస్తున్నప్పటికీ విద్యా వ్యవస్థను గాలికొదిలేశారన్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లి రూ.1,000 కోట్లు ఇస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించి ఇప్పటివరకు రూ.1,000 కూడా ఇవ్వలేదన్నారు. గత బీఆరఎస్ ప్రభుత్వం దాదాపు రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలు పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం మరో రూ.4 వేల కోట్లు చేర్చిందని, దాదాపు 20 లక్షల మంది విద్యార్థులకు రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని, దీనికి కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కాలేజీలు అధ్యాపకులకు జీతాలు ఇవ్వలేకపోతున్నాయని, విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని తెలిపారు. యూత్ డిక్లరేషన్ పేరుతో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. హైకోర్టు మొట్టికాయలు వేయడంతో వచ్చే ఏడాదికి అడ్వాన్స్‌గా రూ.2 వేల కోట్లు విడుదల చేస్తామని చెప్పిన సర్కారు ఆ హామీని కూడా నిలబెట్టుకోలేదన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థులు తమ సమస్యల కోసం పోరాడితే వారిపై పోలీసులు లాఠీచార్జి చేయడమేగాక దురుసుగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయుష్, హోమియోపతి విద్యార్థులు స్టైఫండ్ల కోసం ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాహుల్ గాంధీ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో విద్యార్థులను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. దమ్ముంటే తెలంగాణకు వచ్చి ఇక్కడి విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎందుకు ఇవ్వడం లేదు.. స్కాలర్‌షిప్‌లు ఎందుకు అందడం లేదో రాహుల్ సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీ రేఖా శర్మ, బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, శాసనమండలి పక్ష నేత ఏవీఎన్ రెడ్డి, ఎంపీలు రఘునందన్ రావు, పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎన్.గౌతం రావు, వీరేందర్ గౌడ్, వేముల అశోక్, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి అండ్ మీడియా ఇన్‌చార్జి ఎన్.వి.సుభాష్, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, రాష్ట్ర అధికార ప్రతినిధులు, పార్టీ పదాధికారులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

**సీఎం రేవంత్‌కు విద్యార్థుల ఉసురు తగలక తప్పదు : లక్ష్మణ్**

ప్రజాపాలన పేరుతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పేద విద్యార్థుల పాలిట శాపంగా మారిందని, గత బీఆరఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్యంతో రాష్ట్రంలో సుమారు రూ. 15వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయి, 40 లక్షల మంది విద్యార్థుల జీవితాలు అంధకారంలో పడ్డాయని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. విద్యార్థుల న్యాయమైన హక్కుల సాధన కోసం 'ఫీజుల బకాయి - బీజేపీ లడాయి' పేరుతో తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షకు సంపూర్ణ మద్దతు, సంఘీభావం తెలియజేస్తున్నానన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అనేది నిధుల కేటాయింపు మాత్రమే కాదు.. సమాజంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ, బలహీన వర్గాల బిడ్డల ఆత్మగౌరవ ప్రతీక అని ఆయన అన్నారు. పేదరికం నుంచి బయటపడేందుకు ఉన్నత విద్యను ఆశ్రయించిన యువతకు ఈ కాంగ్రెస్ సర్కార్ తీవ్ర ద్రోహం చేస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో అశోక్ నగర్ రోడ్లలో రాహుల్ గాంధీ నిరుద్యోగులను, విద్యార్థులను కౌగిలించుకుని ఇచ్చిన బూటకపు హామీలను నమ్మి తెలంగాణ యువత మోసపోయిందన్నారు. నేడు న్యాయమైన హక్కుల కోసం ప్రశ్నిస్తే ప్రభుత్వం విద్యార్థులపై లాఠీచార్జిలకు తెగబడుతున్నదన్నారు. ఉద్యమానికి ఊపిరిపోసిన విద్యార్థి లోకాన్ని అవమానించిన సీఎం రేవంత్‌కు ఆ బిడ్డల ఉసురు తగలక తప్పదన్నారు. విద్యాశాఖను తన దగ్గరే ఉంచుకుని విద్యావ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే ఆ మంత్రిత్వ శాఖ బాధ్యతల నుంచి వైదొలగాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

# 22-ఏపై దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

రాష్ట్రంలో 22ఏలో లక్షలాది ఎకరాలు చేర్చారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సచివాలయంలో సోమవారం మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ 2023 డిసెంబర్ 7 నాటికి ఉన్న పరిస్థితి, ప్రస్తుత పరిస్థితి, ఏ కేటగిరీ భూములు ఎంతమేర నిషేధిత జాబితాలో ఉన్నాయో పూర్తి వివరాలను ప్రజల ముందుంచుతున్నామని వెల్లడించారు. 22ఎ పేరిట ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతాన్ని సృష్టిస్తూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. 22ఎ పేరిట ఇంతవరకు వచ్చిన దరఖాస్తుల్లో 98 శాతం రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని, దీనిపై దుష్ప్రచారాలను నమ్మవద్దని ప్రజలను కోరారు. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం వచ్చే నాటికి నిషేధిత జాబితాలో ఉన్న అటవీ, వక్ఫ్, దేవాదాయ, అసైన్డ్, ప్రభుత్వ భూములు, కోర్టు ఆదేశాల మేరకు నిషేధిత జాబితాలో ఉన్న భూములు, ప్రైవేట్ భూములు తదితర వివరాలను కేటగిరీల వారీగా మొత్తం వివరాలను మీడియాకు విడుదల చేశారు. లక్షలాది ఎకరాలు 22ఎలో పెట్టారని ప్రతిపక్షాలు ఆరోపణలు చేయడం కాదు.. ఎంత ఉంది, ఎందుకు ఉంది, ఎవరి భూమి, ఏ కారణంతో నిషేధిత జాబితాలో పెట్టారనే ప్రతి అంశాన్ని రికార్డులతో చెబుతాం.. వాస్తవాలు ప్రజల ముందుకు వస్తే ఎవరు నిజం చెబుతున్నారో వారే నిర్ణయిస్తారన్నారు. ప్రభుత్వ భూములు, ప్రజా ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులు లేదా రియల్ ఎస్టేట్ ప్రయోజనాలకు మళ్లించకుండా కాపాడటం 22ఏ ప్రధాన ఉద్దేశమని మంత్రి తెలిపారు. మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని రెండు రెవెన్యూ గ్రామాల్లో 122 ఎకరాలు, మరోచోట 400కు పైగా ఎకరాలు కలిపి సుమారు 522 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించిన వ్యవహారాలను మంత్రి ఉదాహరణగా ప్రస్తావించారు. ఎన్నికలకు ముందు ఈ భూముల వ్యవహారం అప్పట్లో మీడియాలో కూడా చర్చకు వచ్చిందని, ప్రభుత్వ భూములపై భారీ విస్తీర్ణాల్లో ప్రైవేట్ వ్యక్తులకు అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. ఇలాంటి భూములను నిషేధిత జాబితాలో పెట్టడం తప్పా? ఎందుకు పెట్టకూడదని ప్రశ్నించారు. సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లి రెవెన్యూ గ్రామంలో 1958కు ముందు అసైన్‌మెంట్ జరిగినట్లు చూపిస్తూ సరైన ప్రభుత్వ రికార్డులు లేకుండానే భూములపై హక్కులు సృష్టించి ధారదత్తం చేశారన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో సర్వే నం.403కు సంబంధించి సుమారు 1,280 ఎకరాల విస్తీర్ణం ఉండగా అందులో రెండు ప్లాట్లు మాత్రమే నిషేధిత జాబితాలో ఉన్నాయని మంత్రి తెలిపారు. గతంలో హైకోర్టు ఆదేశాల మేరకు రికార్డులు అప్‌లోడ్ చేసే సమయంలో మొత్తం సర్వే నంబర్‌ను పేర్కొనడం వల్ల ముఖ్యమంత్రి నివాసంతోపాటు తన నివాసం కూడా పీవోబీలో చేర్చారని, దానిని గుర్తించి వెంటనే సరిచేశామని తెలిపారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం అన్నారంలో సర్వే నం.172 ప్రభుత్వ భూమి, 173 ప్రైవేట్ భూమి అని, 173 పేరుతో అనుమతులు తీసుకుని 172 ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపట్టిన ఉదాహరణను మంత్రి వివరించారు. 'ప్రైవేట్ సర్వే నంబర్ పేరుతో అనుమతులు తీసుకుని ప్రభుత్వ భూమిలో నిర్మాణం చేస్తే ఆ ప్రభుత్వ భూమిని 22ఏలో పెట్టకూడదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ భూమిని కాపాడటం తమ బాధ్యత' అని వివరించారు. మేడ్చల్ జిల్లా పర్వతాపూర్ ప్రాంతంలో ప్రధాన రెవెన్యూ గ్రామం, దానికి అనుబంధ శివారుకు ఒకే తరహా సర్వే నంబర్లు కేటాయించడం వల్ల భూ వివాదాలు తలెత్తాయని మంత్రి చెప్పారు. సర్వే నంబర్లను సక్రమంగా పునర్వ్యవస్థీకరించి, సమగ్ర సర్వే ద్వారా ఇలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. మహేశ్వరం మండలంలోని 22 ఎకరాల సర్వే నంబరులో రెండెకరాలు భూదాన్ భూమి ఉంటే మొత్తం 22 ఎకరాలకు పాస్‌బుక్ జారీ కావడం, భూదాన్ రెండెకరాలను ప్రత్యేకంగా గుర్తించడంలో సమస్య ఏర్పడడంతో మొత్తం 22 ఎకరాలను పీవోబీలో పెట్టారని చెప్పారు. భూదాన్, అసైన్డ్, ప్రభుత్వ భూముల విషయంలో రికార్డులను కేసుల వారీగా పరిశీలించి వాస్తవ హక్కుదారులకు న్యాయం చేస్తామని చెప్పారు. ప్రభుత్వ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు నకిలీ జీవోలు, మెమోలు, అధికారుల సంతకాలతో బోగస్ పత్రాలు సృష్టిస్తున్న వ్యవహారాలను గుర్తించామని, ఆమేరకు క్రిమినల్ కేసుల నమోదుకు ఆదేశాలిస్తున్నామని చెప్పారు. మేడ్చల్ జిల్లాలో ఏప్రిల్ 22వ తేదీతో జిల్లా కలెక్టర్ సంతకం చేసినట్లు చూపిస్తూ ఒక నకిలీ మెమోను, మరోచోట జూన్ 2వ తేదీతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పేరుతో బోగస్ సర్టిఫికెట్‌ను సృష్టించి రిజిస్ట్రేషన్ కోరిన వ్యవహారాలను గుర్తించామని చెప్పారు. సంబంధిత వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు. పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టం(యూఎల్‌సీ)కి సంబంధించి కొద్ది రోజుల్లో ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంటుందని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో సీఎస్ 7, సీఎస్14కు సంబంధించి 2017లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి సంబంధించిన పత్రిక ఎండీ ఒక భూస్వామి నుంచి ఎస్ క్లాస్ బెంజి కారు తీసుకుని ఐదు డాక్యుమెంట్ల ద్వారా 811 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్న అంశంపై ప్రధాన ప్రతిపక్షం కోరితే సెట్ దర్యాప్తునకు ఆదేశిస్తామని చెప్పారు. రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్, మేడ్చల్‌మల్కాజిగిరి ప్రాంతాల్లో య□ఎల్‌సి క్లియరెన్స్‌కు సంబంధించిన సమస్యలను మంత్రి పొంగులేటి వివరించారు. య□ఎల్‌సీ క్లియర్ చేసుకున్న భూములకు సంబంధించిన జీవోలు, ఉత్తర్వులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి సమస్యలను పరిష్కరిస్తున్నామని, య□ఎల్‌సీకి దరఖాస్తు చేయని లేదా క్లియరెన్స్ పొందని భూములు నిషేధిత జాబితాలో ఉండటం సహజమేనని చెప్పారు. యూఎల్‌సీ క్లియర్ చేసుకున్న వారికి ఇబ్బంది లేదు.. అవసరమైన పత్రాలు అందిస్తే ప్రభుత్వం పరిశీలించి క్లియర్ చేస్తుంది అని చెప్పారు. కానీ య□ఎల్‌సి కూడా చేయించుకోకుండా ప్రభుత్వ భూములను ప్రైవేట్ భూములుగా చూపిస్తూ ప్రచారం చేయడం సరికాదన్నారు.

**22-ఎ సమస్యలపై టోల్‌ఫ్రీ నంబరుకు 1162 కాల్స్**

22ఏ సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్‌కు ఇప్పటివరకు 1,162 కాల్స్ వచ్చాయని మంత్రి తెలిపారు. రిపీటెడ్, ఓవర్‌ల్యాప్ కాల్స్ తొలగించిన తర్వాత 980 ప్రత్యేక ఫిర్యాదులు ఉన్నాయని చెప్పారు. వీటిలో 547 వ్యవసాయ భూములు, 433 వ్యవసాయేతర భూములకు సంబంధించినవని తెలిపారు. రంగారెడ్డి నుంచి 258, మేడ్చల్ నుంచి 149, సంగారెడ్డి నుంచి 82, కామారెడ్డి నుంచి 44, యాదాద్రి భువనగిరి నుంచి 40, సిద్దిపేట నుంచి 35 కాల్స్ వచ్చినట్లు వివరించారు. 22ఎపై కొన్ని పత్రికల్లో వస్తున్నట్లు తీవ్ర సమస్య లేదన్నారు. ఇప్పటికే రిలాక్సేషన్ పొందిన 22ఏ కేసుల్లో సుమారు 98 శాతం ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకున్నామని మంత్రి తెలిపారు. 300కు పైగా ప్లాట్లలో దేవాదాయ, భూదాన్ తదితర కారణాలతో రిజిస్ట్రేషన్‌కు వీలు లేని 1213 కేసులను మాత్రమే తిరస్కరించినట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోలేకపోయిన వారికి ఈ వారాంతం లోపు ఆ మొత్తాన్ని తిరిగి వారి ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. 22ఏకు సంబంధించిన నిజమైన సమస్యలను 24 గంటల్లో, అవసరమైన సందర్భాల్లో గరిష్ఠంగా 36 గంటల్లో పరిష్కరించేలా ఫాస్ట్‌ట్రాక్ విధానం అమలు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ప్రజలను భయపెట్టడం తమ ప్రభుత్వ విధానం కాదు.. ప్రజలకు భరోసా కల్పించడం తమ బాధ్యత. ప్రభుత్వ భూములను కాపాడటం ఎంత ముఖ్యమో న్యాయబద్ధమైన ప్రైవేట్ ఆస్తులకు రక్షణ కల్పించడం కూడా అంతే ముఖ్యం' అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ప్రతీ ఫిర్యాదును పరిశీలిస్తాం.. ప్రతీ రికార్డును ధ్రువీకరిస్తాం.. తప్పు జరిగితే సరిదిద్దుతాం.. అక్రమం జరిగితే చర్యలు తీసుకుంటాం. కానీ తప్పుడు ప్రచారంతో ప్రజలను భయాందోళనలకు గురి చేయడాన్ని ప్రభుత్వం అనుమతించదు అని అన్నారు. సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజి రాజీవ్ గాంధీ హనుమంతు, హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.




# అధిష్ఠానం పరిశీలనలో సుష్మిత వ్యవహారం

**మొదటిపేజీ తరువాయి**

చర్యలు తీసుకోవాలని పార్టీ నేతలు పట్టుబడుతున్న పరిస్థితి రోజురోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సురేఖ అంశంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. మెదక్ హౌసింగ్ బోర్డులోని ఓ ఫంక్షన్ హాల్లో సోమవారం నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సురేఖ అంశాన్ని క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తోందని చెప్పారు. ఇప్పటికే ప్రాథమిక నివేదికను ఏఐసీసీకి అందజేశామని, సమగ్ర నివేదిక వచ్చాక పెద్దలు ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. కాంగ్రెస్ పెద్ద పార్టీ కాబట్టి చెప్పుకునే స్వేచ్ఛ ఎక్కువ ఉంటుందని మహేశ్ తెలిపారు. స్వేచ్ఛ హద్దులు దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని, తనతో సహా అందరూ హద్దుల్లో ఉంటే మంచిదని అన్నారు. ప్రతి కుటుంబంలో సమస్యలు ఉన్నట్టుగానే కాంగ్రెస్ కుటుంబంలో కూడా ఉంటాయన్నారు. కష్టపడ్డ కార్యకర్తకు న్యాయం జరుగుతుంది.. ఇది సీఎం మాట, నా మాట, మీనాక్షి నటరాజన్ మాట. ఎవ్వరికీ కూడా 100 శాతం న్యాయం చేయలేం.. నేను వాస్తవాలు మాట్లాడతా. 70 శాతం పదవులు పాత కాంగ్రెస్ నాయకులకే దక్కేలా అధిష్ఠానం హామీ ఇచ్చింది. ములుగులో మంత్రి సీతక్క పాత నాయకులకే పదవులు ఇచ్చారని తెలిపారు. సోషల్ మీడియాలో బీఆర్ఎస్, బీజేపీలు కాంగ్రెస్ పై దుష్ప్రచారం చేస్తున్నాయని మహేశ్ మండిపడ్డారు. సోషల్ మీడియాపై కేటీఆర్ ఆశలు పెట్టుకున్నారని, కత్తి దూసినోడు కత్తికే చనిపోతాడు అన్నట్టు కేటీఆర్ ను సోషల్ మీడియానే ఖతం చేస్తుందని వ్యాఖ్యానించారు. పదేళ్లు బీఆర్ఎస్ చేసిన దోపిడీ, భూ దందా, అరాచక పాలనను ప్రజలు మర్చిపోలేదన్నారు. మల్లన్నసాగర్ కట్టేటప్పుడు ఎంతమందిపై కేసులు పెట్టి జైలుకి పంపారో జనాలు మర్చిపోలేదని తెలిపారు. ప్రధాని మోదీ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో మెదక్ ఎంపీ రఘునందన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉన్న ఉద్యోగాలు తీసేసిన ఘనత ప్రధాని మోదీది అంటూ విరుచుకుపడ్డారు. మోదీ హవా తగ్గిందని.. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఆయన ఇంటికి పోక తప్పదని అన్నారు. ప్రజలు 39 సీట్లు ఇచ్చి ప్రతిపక్ష హోదా ఇస్తే కేసీఆర్ ఫామ్ హౌస్ కే పరిమితం అయ్యారన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ లలో ప్రజాస్వామ్యం తక్కువన్నారు. దళితుడు రాజయ్య డిప్యూటీ సీఎంగా ఉంటే రాత్రికి రాత్రే పదవి నుంచి తొలగించారని, ఈటల రాజేందర్‌ను మెడ పట్టి గెంటేశారని మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

# సింగరేణిని లాభాల బాటలో నడిపిస్తాం

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

రాష్ట్రానికి ఆత్మ లాంటి అత్యుత్తమ ప్రభుత్వరంగ సంస్థ అయిన సింగరేణిని కాపాడుకుంటూ భవిష్యత్ తరాలకు కూడా లాభదాయక సంస్థగా అందించడమే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. సింగరేణి ఉజ్వల భవిష్యత్తు కోసం దిశా నిర్దేశం చేస్తూ కంపెనీ మనుగడకు కీలకమైన బొగ్గు బ్లాక్‌లు సాధించడంలో సంపూర్ణ సహకారం అందిస్తున్న భట్టి విక్రమార్క మల్లుకు సింగరేణిలోని గుర్తింపు, ప్రాతినిధ్య, అధికార సంఘాల నాయకులు సచివాలయంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కొత్త బొగ్గు బ్లాక్‌లను తీసుకోకపోవడం, ఉన్న గనులను మూసివేయడం వల్ల సింగరేణికి తీవ్ర నష్టం జరిగిందన్నారు. అయిదారేళ్లల్లో సంస్థ మూతపడే పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేబినెట్ మంత్రులు గట్టి పట్టుదలతో నైనీ కోల్ బ్లాక్‌ను సాధించామని చెప్పారు. 2013లో యూపీఏ ప్రభుత్వం సింగరేణికి రీఅసైన్ చేసిన తాడిచర్ల2 కోల్ బ్లాక్ విషయాన్ని కేంద్రంతో మాట్లాడి మైనింగ్ లీజు దక్కించుకోవడంలో ప్రభుత్వం సఫలమైందని తెలిపారు. అంతేకాక జెన్కోను ఒప్పించి సింగరేణికి వేలంలో మణుగూరు డీప్‌సైడ్ బ్లాక్2 దక్కేలా కృషి చేశామన్నారు. ఒడిశాలోని 'నైనీ' బ్లాక్ సమస్యల పరిష్కారానికి స్వయంగా వెళ్లి స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి మార్గం సుగమం చేశామని వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తిలో సోలార్, విండ్ వంటి ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులోకి వస్తుండటంతో భవిష్యత్తులో థర్మల్ పవర్ డిమాండ్, బొగ్గు వినియోగం తగ్గే అవకాశం ఉందన్నారు. కేవలం బొగ్గుపైనే ఆధారపడితే సింగరేణి కూడా ఒకప్పటి బీఎసఎనఎల్‌లా వెనుకబడిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అందుకే ప్రపంచ మార్పులకు అనుగుణంగా కాపర్, గ్రాఫైట్, లిథియం, కోబాల్ట్ వంటి క్రిటికల్ మినరల్స్(కీలక ఖనిజాలు) మైనింగ్ వైపు సింగరేణిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ అవకాశాలను అధ్యయనం చేసేందుకు సౌత్ ఆఫ్రికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా, చిలీ వంటి దేశాలకు అంతర్జాతీయ కన్సల్టెంట్లను నియమించామని డిప్యూటీ సీఎం చెప్పారు. ఇప్పటికే కర్ణాటకలోని ఒక గోల్డ్ మైన్ వేలంలో పాల్గొని సాధించామని, ఆ గని ద్వారా భవిష్యత్తులో అక్కడ మైనింగ్ చేస్తే సింగరేణికి నిరంతరం రాయల్టీ లేదా ఆదాయం వస్తుందని చెప్పారు. రాష్ట్రంలో, దేశంలో, ప్రపంచంలో ఎక్కడైనా సరే మైనింగ్ బ్లాక్‌లను దక్కించుకునేలా ముందుకు వెళ్లాలన్నారు. వందేళ్లకుపైగా అనుభవం ఉన్న సింగరేణి సంస్థను అంతర్జాతీయస్థాయిలో అత్యుత్తమ సంస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ప్రతీ ఒక్కరూ సమష్టిగా పనిచేసి కంపెనీని ఉన్నత స్థాయిలో నిలపడానికి సహకరించాలన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ భట్టి విక్రమార్క సమర్థవంతమైన, డైనమిక్ నాయకత్వంలో సింగరేణి సంస్థ కొత్త గనుల ప్రారంభం, వ్యాపార విస్తరణ, నూతన ప్రాజెక్టులతో శరవేగంగా ముందుకు సాగుతోందని కొనియాడారు. భవిష్యత్తులో సింగరేణిని దేశంలోనే అత్యుత్తమ ప్రభుత్వరంగ సంస్థల్లో ఒకటిగా నిలిపేందుకు తమ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. సింగరేణి గొప్పతనాన్ని ఎన్నో వేదికలపై ప్రశంసించానని గుర్తు చేసుకున్నారు. మనమందరం గర్వపడాల్సిన ప్రతిష్ఠాత్మకమైన సంస్థ సింగరేణి అని అభివర్ణించారు. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రాతినిధ్య కార్మిక సంఘం సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, అధికారుల సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతి గౌడ్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత సింగరేణి కోసం అతికీలకమైన నైనీ బొగ్గు బ్లాక్ సాధన కోసం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వయంగా ఒడిశా వెళ్లి అక్కడ ముఖ్యమంత్రిని, స్థానిక ప్రజాప్రతినిధులను, ప్రజలను కలిసి వారందరినీ ఒప్పించి అన్ని అనుమతులు సాధించారని కొనియాడారు. ఆయన కృషి ఫలితంగా గత ఏడాది నైనీ బొగ్గు బ్లాక్ నుంచి ఉత్పత్తి ప్రారంభమైందని, రాష్ట్ర ఇంధన అవసరాల కోసం ఈ నెలలో తొలి బొగ్గు రేక్‌ను సింగరేణికి కూడా రవాణా చేయడం సాధ్యమైందని అన్నారు. అదే సమయంలో 2013లో యూపీఏ ప్రభుత్వ కేటాయించిన తాడిచెర్ల2 బ్లాక్‌కు మైనింగ్ లీజు సాధించడంలోనూ ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక కృషి చేశారని ప్రశంసించారు. బొగ్గు గనుల వేలంలో పాల్గొనకుండా గత బీఆరఎస్ పాలకులు సింగరేణిని అడ్డుకోవడం వల్ల కంపెనీ మనుగడకు కీలకమైన రెండు కీలక గనులను చేజార్చుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రభుత్వంలో సింగరేణిలో బొగ్గు బ్లాక్‌ల వేలంలో పాల్గొనడానికి సింగరేణికి అనుమతి ఇవ్వడం వల్ల ఇటీవలే మణుగూరు డిప్‌సైడ్ 2 బ్లాక్‌ను సింగరేణి చేజిక్కించుకుందని వారు వివరించారు. బొగ్గు ఉత్పత్తికి పరిమితమైన సింగరేణి సంస్థను కీలక ఖనిజ రంగం వైపు తీసుకెళ్తు అంతర్జాతీయ సంస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారన్నారు. కర్ణాటకలో బంగారం, రాగి ఖనిజ అన్వేషణ లైసెన్స్ కూడా సింగరేణి దక్కించుకోవడంలో ప్రజా ప్రభుత్వంలో సింగరేణి సాధించిన మరో విజయమన్నారు. అదే సమయంలో కార్మికుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. కాంట్రాక్టు కార్మికులకు బోనస్ పంపిణీ చరిత్రాత్మకమన్నారు. డిపెండెంట్ ఉద్యోగాల్లో గరిష్ఠ వయో పరిమితిని 35 నుంచి 40 ఏళ్లకు పెంచడం వల్ల వందలమంది లబ్ధిపొందారన్నారు. సన్మాన కార్యక్రమంలో గుర్తింపు కార్మిక సంఘం జనరల్ సెక్రటరీ రాజ్‌కుమార్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నర్సింహారెడ్డి, లక్ష్మీపతిగౌడ్, కార్యదర్శు పెద్ది నర్సింహులు, అన్ని ఏరియాలకు సంబంధించిన గుర్తింపు, ప్రాతినిధ్య, అధికార సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## అటవీ శాఖలో పలువురు అధికారుల
# డిప్యూటేషన్లు రద్దు

**హైదరాబాద్, ఆగస్ట్ 24 :**

ప్రభుత్వం అటవీ శాఖలో ఒక కీలకమైన పరిపాలనా నిర్ణయం తీసుకుంది. శాఖ పరిధిలో తీవ్ర కలకలం రేపుతూ పలువురు ఐఎఫ్ఎస్ అధికారులు, ఇతర ఉన్నతాధి కారుల డిప్యూటేషన్లను రద్దు చేస్తూ ఉత్త ర్వులు జారీ చేసింది. డిప్యూటేషన్పై పనిచే స్తున్న అధికారుల డిప్యూటేషన్లను తక్షణమే రద్దు చేస్తూ, సంబంధిత అధికారులు వెంటనే హైదరాబాద్లోని పీసీసీఎఫ్ (ప్రధాన అటవీ సంరక్షణ అధికారి) కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. కాగా, సాధారణంగా ఏ ప్రభుత్వ శాఖలోనైనా అధికారుల డిప్యూటేషన్లు, బదిలీల నిర్ణయం సంబంధిత శాఖ మంత్రి ఆమోదంతోనే జరుగుతాయి. అయితే అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖకు కనీస సమాచారం కూడా ఇవ్వకుండానే ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేయడం సచివా లయంలోనూ, రాజకీయ వర్గాల్లోనూ తీవ్ర చర్చనీయాంశమైంది. ఇటీవల మంత్రి సురేఖ కుటుంబ సభ్యుల వ్యాఖ్యలు, సొంత పార్టీ నాయకులతో విభేదాలు సృష్టించిన రాజకీయ వాతావరణం నేపథ్యంలో సీఎంఓ నేరుగా జోక్యం చేసుకుని ఈ కీలక నిర్ణయం తీసుకోవడం వెనుక ఉన్న వ్యూహంపై రకరకాల ప్రచారాలు జోరందుకున్నాయి. డిప్యూటేషన్ రద్దుతో అధికారులను తిరిగి మాతృ శాఖలకు లేదా కొత్త పోస్టింగ్ లకు పంపే దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వంలో మంత్రి ప్రమేయం లేకుండా శాఖలో పెద్ద మార్పు జరగడం రాబోయే రోజుల్లో రాజకీయపరమైన పరిణామాలకు దారితీసే అవకాశం కనిపిస్తోంది.




# సర్కారు స్కూళ్లలో మౌలిక వసతులు మెరుగుపరచాలి

- **టీజీహెచ్ఆర్సీ ఆదేశాలు**

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, తరగతి గదులు, మరుగుదొడ్లు తదితర ప్రాథమిక సౌకర్యాలపై హెచఆర్సీ నెం.2638 ఆఫ్ 2026 తేదీ 3.8.2026న చైర్‌పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని తెలంగాణ మానవ హక్కుల కమిషన్(టీజీహెచ్ఆర్సీ) కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో తగిన తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతర ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు చెట్ల కింద, వరండాల్లో, కమ్యూనిటీ భవనాల్లో తరగతులకు హాజరవుతున్నారంటూ జూలై 3న ఒక దినపత్రికలో ప్రచురితమైన వార్త ఆధారంగా కమిషన్ సుమోటోగా కేసును స్వీకరించింది. కమిషన్ ఆదేశాల మేరకు ఆదిలాబాద్, జనగాం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల జిల్లా విద్యాశాఖాధికారుa౿ నివేదికలు సమర్పించారు. వాటిని పరిశీలించగా పలు ప్రభుత్వ పాఠశాలల్లో శిథిలావస్థలో ఉన్న తరగతి గదులు, మరమ్మతులు అవసరమైన తరగతి గదులు, మరుగుదొడ్ల కొరత వంటి మౌలిక వసతుల లోపాలు ఉన్నట్లు వెల్లడైంది. నల్గొండ జిల్లా నిడమనూరు మండలం ఊట్కూర్‌లోని జడ్పీ ఉన్నత పాఠ శాలను జిల్లా విద్యాశాఖాధికారి స్వయంగా పరిశీలించినట్లు నివేదికలో పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా పాత రేకుల పైకప్పు నుంచి లీకేజీలు ఏర్పడటంతో మరమ్మతులు జరుగుతున్న సమయంలో విద్యార్థులకు తాత్కాలికంగా చెట్ల కింద తరగతులు నిర్వహించినట్లు నివేదికలో వెల్లడించారు. విద్యార్థులకు సురక్షితమైన తరగతి గదులు, పారిశుధ్య సౌకర్యాలు, ఇతర ప్రాథమిక వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని కమిషన్ స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఎ ద్వారా కల్పించిన విద్యా హక్కు పాఠశాలలో ప్రవేశం కల్పించడంతో పరిమితం కాదని, పిల్లలు సురక్షితమైన, గౌరవప్రదమైన, అనుకూలమైన వాతావరణంలో విద్యను అభ్యసించే పరిస్థితులు కూడా అందులో భాగమేనని కమిషన్ పేర్కొంది.

**స్థానికనగర గైడ్‌లను పరిశీలించడం అన్ని జిల్లాలపై వేదికలు కోరాలి**

రాష్ట్రంలోని అన్ని జిల్లాల జిల్లా విద్యాశాఖాధికారుల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, ప్రాథమిక సౌకర్యాలపై నిలని పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కమిషన్ ఆదేశించింది. అలాగే ఈ అంశాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చించి ప్రభుత్వ పాఠశాలల్లో సురక్షితమైన తరగతి గదులు, పనిచేసే మరుగుదొడ్లు, ఇతర ప్రాథమిక సౌకర్యాలు కల్పించేందుకు, అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు, పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు తక్షణ, సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని కమిషన్ సిఫారసు చేసింది. మానవ హక్కుల పరిరక్షణ చట్టం 1993లోని సెక్షన్ 18(ఇ) ప్రకారం కమిషన్ సిఫారసులపై తీసుకున్న లేదా ప్రతిపాదించిన చర్యల వివరాలను ఆరు నెలల్లోగా కమిషన్‌కు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించింది.

# రైతు నాయకుడు, కమ్యూనిస్టు నేత సారంపల్లి మృతి

**హైదరాబాద్, ఆగస్టు 24 :**

కమ్యూనిస్టు సీనియర్ నాయకుడు, రైతు సంఘం నాయకుడు సారంపల్లి మల్లారెడ్డి(88) కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ సోమవారం తుదిశ్వాస విడిచారు. మంగళవారం ఉదయం ఎంబీ భవన్‌కు ఆయన పార్థివ దేహాన్ని తరలిస్తారు. అభిమానుల సందర్శనార్థం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం వరకు అక్కడ ఉంచనున్నారు. మల్లారెడ్డి స్వస్థలం వరంగల్ జిల్లా నర్సంపేట. ఆయన దశాబ్దాలుగా రైతు సమస్యలపై పోరాడుతున్నారు. అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడిగానూ పనిచేశారు.



**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి**

రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాడిన రైతు నాయకుడు, కమ్యూనిస్టు నేత సారంపల్లి మల్లారెడ్డి మరణించారని తెలిసి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. రైతుల హక్కులు, వ్యవసాయ సమస్యల పరిష్కారం కోసం ముందుండి అనేక ఉద్యమాలు నడిపించారని గుర్తు చేశారు. రైతు సంఘం నేతగా, అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడిగా ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. భూమి హక్కులు, సాగునీరు, వ్యవసాయ రుణాలు, విత్తనాలు వంటి వ్యవసాయ రంగానికి సంబంధించిన విస్తృత అంశాలపై నిరంతరం కృషి చేస్తూ జీవితాన్ని రైతుల సంక్షేమం కోసం అంకితం చేసిన నాయకుడు మల్లారెడ్డి అని కొనియాడారు. సారంపల్లి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. మల్లారెడ్డి కుటుంబ సభ్యులు, అభిమానులకు ముఖ్యమంత్రి సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**రైతాంగం కోసం అంకితమైన నేత సారంపల్లి : మంత్రి సీతక్క**

సారంపల్లి మల్లారెడ్డి మృతి పట్ల మంత్రి సీతక్క సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, పేదల హక్కుల కోసం దశాబ్దాలుగా ఆయన సాగించిన పోరాటం, రైతాంగ ఉద్యమానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.




# సెప్టెంబర్ 11న బ్యాంక్ యూనియన్ల సమ్మె

- వరుస సెలవులతో కస్టమర్లకు ఇబ్బందులే

**న్యూఢిల్లీ,ఆగస్ట్24:**

దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకుల్లో 5 రోజుల పని విధానాన్ని వెంటనే అమలు చేయాలంటూ బ్యాంక్ యూనియన్ల ఐక్య వేదిక డిమాండ్ చేస్తోంది. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ డిమాండ్‌ను నెరవేర్చుకునేందుకు సెప్టెంబర్ 11న దేశవ్యాప్త సమ్మె (Bank unions strike) కు పిలుపునిచ్చారు. ఆ రోజున సమ్మె జరిగితే.. బ్యాంకు కార్యకలాపాలకు వరుసగా నాలుగురోజుల పాటు అంతరాయం కలగనుంది. సెప్టెంబర్ 11న శుక్రవారం. తర్వాత రెండో శనివారం, ఆదివారం ప్రభుత్వ సెలవులు. ఇక సోమవారం 14న వినాయక చవితి కావడంతో తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా పలు చోట్ల బ్యాంకు కార్యకలాపాలు నడవవు. అలా నాలుగురోజుల పాటు బ్యాంక్ సేవలు అందక ప్రజలు కొంత ఇబ్బంది పడాల్సి వస్తుంది.

11వ తేదీతోపాటు సెప్టెంబర్ 28 నుంచి మూడురోజుల పాటు మరోసారి సమ్మె చేస్తామని యూనియన్ హెచ్చరించింది. సెప్టెంబర్ 30తో ఆర్థిక సంవత్సరం సగం పూర్తవుతుంది. అప్పుడు అన్ని సంస్థలు తమ ఖాతా పుస్తకాలను సరిచూసుకుంటాయి. వారానికి ఐదు రోజుల డిమాండ్‌తో పాటు పనితీరు ఆధారిత ప్రోత్సాహకాల పథకం, పింఛను విషయంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని బ్యాంక్ సిబ్బంది కోరుతున్నారు. ఇప్పటికే రెండో, నాలుగో శనివారం సెలవులు ఇస్తున్నారు. మరో రెండు సెలవులు ఇస్తే అలా నెలలో ఐదురోజుల పనిదినం అమలవుతుంది. తమ డిమాండ్లను పట్టించుకోకపోతే.. అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామని ప్రకటించారు. సమావేశంలో బ్యాంక్ యూనియన్ల సభ్యులు ఈ నిర్ణయాలు తీసుకున్నారు.

# మహిళలకు తమిళ సీఎం విజయ్ వరాలు

- ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల ప్రకటన
- ట్రాన్స్ జెండర్లకు కూడా ఉచిత బస్సు సౌకర్యం




**చెన్నై, ఆగస్ట్ 24 :**

తమిళనాడు అసెంబ్లీ వేదికగా మహిళలపై ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ వరాల జల్లు కురిపించారు. ఎన్నికల హామీ మేరకు పలు సంక్షేమ పథకాలను ప్రారంభించనున్నట్లు సోమవారం తెలిపారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత ఎల్‌పీజీ సిలిండర్లు అందించనున్నట్లు సీఎం ప్రకటించారు. అన్నపూర్ణి సూపర్ సిక్స్ పథకం కింద దీనిని అమలు చేయనున్నట్లు, లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు నేరుగా జమ అయ్యేలా పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ ఉచిత ఎల్‌పీజీ సిలిండర్ల పథకాన్ని వచ్చే ఏడాది పొంగల్ పండుగ నుంచి అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ పథకం కింద సుమారు రూ.1.30 కోట్ల కుటుంబాలకు లబ్ది చేకూరనుంది. అలాగే రాష్ట్ర ఖజానాపై ఏడాదికి సుమారు రూ.4,000 కోట్ల భారం పడనుంది. మహిళలు, ట్రాన్స్‌జెండర్ల కోసం ఉచిత బస్సు ప్రయాణాన్ని మరింత విస్తరిస్తూ 'వెట్రి పయన తిట్టం' పథకాన్నీ సీఎం విజయ్ ప్రకటించారు. దీని ద్వారా ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రకటించడంతోపాటు మహిళల కోసం దీని పరిధిని విస్తరించారు. ఇకపై ఎక్స్‌ప్రెస్, లిమిటెడ్ స్టాప్ సర్వీస్, డీలక్స్ సర్వీసుల బస్సుల్లోనూ మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించనున్నారు. ఉచిత ప్రయాణం పొందేందుకు ఆదాయ పరిమితి, ప్రయాణాల సంఖ్యపై ఎలాంటి నిబంధనలు ఉండవని సీఎం స్పష్టం చేశారు. గాంధీ జయంతి రోజైన అక్టోబర్ 2 నుంచి ఈ పథకం అమల్లోకి రానుందని తెలిపారు. అలాగే, అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి మరో సంచలన నిర్ణయం ప్రకటించారు. చెన్నై శివార్లలోని పరందూర్‌లో రెండో విమానాశ్రయం నిర్మించాలన్న ప్రతిపాదనను తమ ప్రభుత్వం విరమించుకుంటున్నట్లు తెలిపారు. విమానాశ్రయాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేస్తున్న వారికి తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. 'పరందూర్ విమానాశ్రయ ప్రాజెక్టును విరమించుకుంటున్నాం.. ప్రతిపాదిత విమానాశ్రయానికి వ్యతిరేకంగా పోరాడుతున్న నిరసనకారులకు అండగా ఉంటా' అని విజయ్ పేర్కొన్నారు.

# ప్రైవేట్ సంస్థలకు ఇస్రోలో స్థానం

- ఇస్రో భవిష్యత్‌పై జైరామ్ రమేశ్ ఆందోళన



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 24 :**

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో భవితవ్యంపై రాజకీయ దుమారం మొదలైంది. ఇస్రోను మోదీ సర్కారు బలహీనపరుస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు జైరామ్ రమేష్ ఆరోపించారు. ఆరు దశాబ్దాలుగా ఇస్రో నిర్మించుకున్న సామర్థ్యాలను ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేసే ప్రయత్నం జరుగుతోందని ఆయన విమర్శించారు. ఇస్రో భవిష్యత్ పాత్రకు సంబంధించి ఇటీవల వెలువడిన వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని జైరామ్ రమేష్ పేర్కొన్నారు. రాకెట్ల తయారీ, ప్రయోగ వాహనాల ఉత్పత్తిలో ఇస్రో పాత్రను గణనీయంగా తగ్గించి, ప్రైవేట్ సంస్థలకు ఎక్కువ బాధ్యతలు అప్పగించే దిశగా ప్రభుత్వం వెళ్తోందని ఆయన ఆరోపించారు. శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణుల కృషితో ఇస్రో ఆరు దశాబ్దాలుగా అభివృద్ధి చేసుకున్న సామర్థ్యాలను, మౌలిక వసతులను ప్రైవేట్ రంగానికి అప్పగించడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రైవేట్ అంతరిక్ష సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ప్రపంచ స్థాయి ప్రతిభను భారత్‌కు ఆకర్షించేలా బలమైన అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను నిర్మించాలని పిలుపునిచ్చారు. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యాన్ని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇస్రో క్రమంగా ప్రయోగ వాహనాల తయారీ, సాధారణ ఉపగ్రహాల తయారీ నుంచి దూరమవుతున్నట్టు విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

# జిన్‌పింగ్ భారత్‌కు.. ఏడేళ్ల తర్వాత రాక?

- సెప్టెంబర్ 12, 13న ఢిల్లీలో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలు
- భారీ బృందంతో జిన్‌పింగ్ వచ్చే అవకాశం
- పుతిన్‌తో పాటు చైనా అధ్యక్షుడి పర్యటనపై ఆసక్తి
- భారత్-చైనా సంబంధాల్లో మార్పులకు సంకేతమంటున్న రాయిటర్స్
- జిన్‌పింగ్ పర్యటనతో బ్రిక్స్ సదస్సుపై పెరగనున్న అంతర్జాతీయ దృష్టి

**న్యూఢిల్లీ, ఆగస్టు 24:**

భారత్ వేదికగా జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ హాజరయ్యే అవకాశం ఉందని రాయిటర్స్ వెల్లడించింది. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీలో జరగనున్న ఈ సదస్సుకు జిన్‌పింగ్ దాదాపు ఏడేళ్ల తర్వాత భారత్‌కు రానున్నట్లు సమాచారం. సుమారు 400 మంది సభ్యులతో కూడిన భారీ బృందంతో ఆయన పర్యటించే అవకాశం ఉందని రాయిటర్స్ కథనం పేర్కొంది. అయితే ఆయన పర్యటనపై తుది అధికారిక ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉంది.

**మళ్లీ ఢిల్లీకి జిన్‌పింగ్?**

2019 అక్టోబర్‌లో భారత్ పర్యటన తర్వాత జిన్‌పింగ్ మళ్లీ దేశానికి రాలేదు. 2020లో తూర్పు లద్దాఖ్ సరిహద్దు ఘర్షణలతో ఇరు దేశాల సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆ తర్వాత క్రమంగా సరిహద్దు సమస్యల పరిష్కారానికి చర్చలు కొనసాగుతున్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో జిన్‌పింగ్ భారత్ పర్యటన ఖరారైతే.. ఇరు దేశాల మధ్య సంబంధాల్లో కొంత సానుకూల మార్పు చోటుచేసుకుంటున్నదనే సంకేతంగా భావించే అవకాశం ఉంది.



**దోవల్-వాంగ్ యీ చర్చలు**

జిన్‌పింగ్ పర్యటనకు ముందు భారత్‌చైనా మధ్య కీలక దౌత్య చర్చలు జరుగుతున్నాయి. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ బీజింగ్‌లో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో సమావేశం కానున్నారు. సరిహద్దు సమస్యలు సహా ఇరు దేశాల మధ్య పెండింగ్‌లో ఉన్న అంశాలపై ఈ చర్చలు జరిగే అవకాశం ఉంది. బ్రిక్స్ సదస్సులో జిన్‌పింగ్ పాల్గొనేందుకు అవసరమైన వాతావరణాన్ని ఈ చర్చలు మరింత మెరుగుపరిచే అవకాశం ఉందని భావిస్తున్నారు.

**పుతిన్ రాకతో మరింత ప్రాధాన్యం**

బ్రిక్స్ సదస్సుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా హాజరయ్యే అవకాశం ఉండటంతో ఢిల్లీ సమావేశాలపై ఇప్పటికే అంతర్జాతీయ ఆసక్తి నెలకొంది. జిన్‌పింగ్, పుతిన్ ఇద్దరూ హాజరైతే ప్రపంచ రాజకీయాల్లో కీలక పరిణామాలపై చర్చలకు ఈ సదస్సు వేదికగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా భారత్‌చైనా సంబంధాల నేపథ్యంలో జిన్‌పింగ్ పర్యటన బ్రిక్స్ ఎజెండా కంటే కూడా ఎక్కువగా చర్చకు వచ్చే అవకాశం ఉందని రాయిటర్స్ విశ్లేషించింది.

# కాక్రోచ్ జనతా పార్టీ మరో ఉద్యమానికి సిద్ధం

- సెప్టెంబర్ 5న ఢిల్లీలో శాంతియుత మార్చ్
- ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ
- కేంద్రం హామీలు అమలు చేయలేదని సీజేపీ ఆరోపణ
- నీట్ బాధిత విద్యార్థుల కుటుంబాల ఆధ్వర్యంలో నిరసన
- గత ఆందోళనల్లో లాఠీచార్జ్..
- పలువురికి గాయాలు బ్రిక్స్ సదస్సుకు ముందు మళ్లీ ఢిల్లీలో ఉద్రిక్తత?



**న్యూఢిల్లీ, ఆగస్టు 24:**

నీట్ పేపర్ లీక్ అంశంపై కేంద్ర ప్రభుత్వంపై మరోసారి ఒత్తిడి పెంచేందుకు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) సిద్ధమైంది. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపిస్తూ సెప్టెంబర్ 5న ఢిల్లీలో శాంతియుత మార్చ్ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఇండియా గేట్ నుంచి ప్రారంభమయ్యే ఈ మార్చ్ ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు కొనసాగుతుందని తెలిపింది.

**బాధిత కుటుంబాల ఆధ్వర్యంలో..**

నీట్ పరీక్ష అనంతరం ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, పోలీసుల చర్యల్లో బాధితులైన కుటుంబ సభ్యులు ఈ మార్చ్‌కు నాయకత్వం వహిస్తారని సీజేపీ వెల్లడించింది. గతంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేపట్టిన సీజేపీ.. ఆ డిమాండ్ నెరవేరడంతో నిరసన విరమించింది. మిగిలిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని కోరింది. నీట్ పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న అభ్యర్థుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని, ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులు, నిరసనకారులపై నమోదైన కేసులను ఎత్తివేయాలని సీజేపీ డిమాండ్ చేసింది. అప్పట్లో ఇచ్చిన హామీలు అమలు కాకపోతే మళ్లీ ఉద్యమిస్తామని హెచ్చరించింది.

**ఎఫ్ఐఆర్‌లపై చర్యలు ఎక్కడ?**

జూలై 25న ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని సీజేపీ తాజాగా ఆరోపించింది. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తోందని, సాంకేతిక అంశాలను సాకుగా చూపుతూ స్పష్టమైన చర్యలకు దూరంగా ఉంటోందని విమర్శించింది. దేశవ్యాప్తంగా నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ల వివరాలను సేకరించి వాటిని రద్దు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు కోరినా.. ప్రభుత్వం ఇప్పటివరకు పూర్తి జాబితాను అందించలేదని పేర్కొంది.

**గతంలో తీవ్ర ఉద్రిక్తత**

నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా గత నెలలో ఢిల్లీలో జరిగిన ఆందోళనలు ఉద్రిక్తంగా మారాయి. పార్లమెంట్ వైపు మార్చ్ చేపట్టిన సమయంలో పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో పలువురు నిరసనకారులు గాయపడ్డారు. ఘర్షణల్లో కొందరు పోలీసులకు కూడా గాయాలయ్యాయి. ఇప్పుడు మరోసారి ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు మార్చ్‌కు పిలుపునివ్వడంతో ఢిల్లీలో భద్రతాపరమైన ఉద్రిక్తతలకు అవకాశం ఉందన్న చర్చ మొదలైంది.

**బ్రిక్స్ సదస్సుకు ముందు..**

సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీలో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలు జరగనున్న నేపథ్యంలో సెప్టెంబర్ 5న సీజేపీ చేపట్టనున్న నిరసనపై ఆసక్తి నెలకొంది. ప్రపంచ దేశాల నేతలు ఢిల్లీకి రానున్న సమయంలో ఈ ఆందోళన ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# గురుగ్రామ్‌ను ముంచెత్తిన భారీ వర్షం

**గురుగ్రామ్, ఆగస్టు 24:**

హర్యానాలోని గురుగ్రామ్‌లో భారీ వర్షం నగరాన్ని మరోసారి అతలాకుతలం చేసింది. సోమవారం కేవలం గంటపాటు కురిసిన వర్షంతో పలు ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మధ్యాహ్నం 1.30 గంటల వరకు సుమారు 70 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు జిల్లా యంత్రాంగం వెల్లడించింది. రోడ్లపై భారీగా నీరు నిలవడంతో ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కార్యాలయాల్లో ఉద్యోగులకు ఇంటి నుంచే పని చేసే అవకాశం కల్పించాలని, పాఠశాలల్లో ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని జిల్లా యంత్రాంగం సూచించింది.

**ప్రధాన రహదారులపై వరద**

రాజీవ్ చౌక్, ఇఫ్కో చౌక్, రైల్వే రోడ్, సెక్టార్ 5, ఓల్డ్ ఢిల్లీ రోడ్, మెహ్రౌలి రోడ్, బసాయ్ రోడ్ ప్రాంతాలు వర్షానికి తీవ్రంగా ప్రభావితమయ్యాయి. రహదారులపై నీరు భారీగా చేరడంతో వాహనాలు వరదలో చిక్కుకున్నాయి. కొందరు వాహనదారులు తమ వాహనాలను అక్కడే వదిలి వెళ్లాల్సి వచ్చింది. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

**విద్యార్థులకు తప్పని అవస్థలు**

పాఠశాలల నుంచి ఇళ్లకు తిరిగి వెళ్తున్న విద్యార్థులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బురద నీటితో రోడ్లు నిండిపోవడంతో కనిపించని మ్యాన్‌హోల్స్‌లో పడిపోతామనే భయంతో పలువురు ఎత్తైన బస్‌స్టాప్‌లు, ఇతర సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. ఢిల్లీజైపూర్ ఎక్స్‌ప్రెస్‌వేపై కూడా వాహనాల రాకపోకలు మందగించాయి. సాధారణంగా సిగ్నేచర్ టవర్ నుంచి హీరోహోండా చౌక్ వరకు 15 నిమిషాల్లో చేరుకునే ప్రయాణానికి సోమవారం కనీసం 50 నిమిషాలు పట్టిందని ప్రయాణికులు తెలిపారు.

**మౌలిక వసతులపై విమర్శలు**

సైబర్ హబ్ సమీపంలోని గేట్‌వే టవర్ మెట్రో స్టేషన్ ఎదురుగా ఎక్స్‌ప్రెస్‌వేలో కొంత భాగం పూర్తిగా నీట మునిగింది. దీంతో నగరంలోని పలు ప్రధాన మార్గాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలు, ప్రముఖ సంస్థల కార్యాలయాలతో 'మిలీనియం సిటీ'గా పేరొందిన గురుగ్రామ్‌లో కొద్దిసేపు భారీ వర్షం కురిసినా రహదారులు జలమయం కావడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాకాలంలో ఇప్పటికే పలుమార్లు ముంపునకు గురైన షీత్లా మాతా రోడ్ తాజా వర్షంతో మరోసారి తీవ్రంగా ప్రభావితమైంది. ప్రతి సారి భారీ వర్షం కురిసినప్పుడు నగర మౌలిక వసతులు విఫలమవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# పుతిన్‌తో జైశంకర్ భేటీ

- మాస్కోలో భారత విదేశాంగ మంత్రికి ఆత్మీయ స్వాగతం
- వాణిజ్యం, ఇంధనం, ఎరువులపై కీలక చర్చలు
- బ్రిక్స్ సదస్సుకు ముందు జైశంకర్ రష్యా పర్యటన
- సెప్టెంబర్‌లో ఢిల్లీకి రానున్న పుతిన్
- భారత్-రష్యా వ్యూహాత్మక బంధంపై మరింత దృష్టి

**మాస్కో, ఆగస్టు 24:**

రష్యా పర్యటనలో ఉన్న భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ సోమవారం ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశమయ్యారు. మాస్కోలోని క్రెమ్లిన్‌లో జరిగిన భేటీలో భారత్‌రష్యా ద్వైపాక్షిక సంబంధాలు, వాణిజ్యం, ఇంధనం, ఎరువులు, అణు సహకారం తదితర అంశాలపై చర్చించారు. ప్రధాని నరేంద్ర మోదీ వ్యక్తిగత సందేశాన్ని కూడా జైశంకర్ పుతిన్‌కు అందజేశారు.

**బ్రిక్స్‌కు ముందు కీలక భేటీ**

జైశంకర్ రెండు రోజుల రష్యా పర్యటనలో భాగంగా 27వ భారత్‌రష్యా అంతర్ ప్రభుత్వ కమిషన్ సమావేశానికి సహాధ్యక్షత వహిస్తున్నారు. రష్యా ప్రథమ ఉప ప్రధాని డెనిస్ మాంటురోవ్ ఆహ్వానం మేరకు ఈ పర్యటన కొనసాగుతోంది. ఇరు దేశాల మధ్య ఆర్థిక సహకారం గణనీయంగా పెరిగిందని జైశంకర్ పేర్కొనగా.. వాణిజ్యం ఈ ఏడాది మరింత వృద్ధి చెందుతోందని పుతిన్ తెలిపారు.

**ఇంధనం.. ఎరువులపై దృష్టి**

భారత్‌రష్యా చర్చల్లో ఇంధనం, ఎరువుల సరఫరాకు ప్రత్యేక ప్రాధాన్యం లభించింది. భారత్‌కు ఎరువుల సరఫరాను పెంచేందుకు రష్యా సిద్ధంగా ఉందని పుతిన్ హామీ ఇచ్చినట్లు సమాచారం. అణు ఇంధనం, ఇంధన సహకారం, వాణిజ్య సంబంధాలను మరింత విస్తరించే అంశాలు కూడా చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది.

# అమెరికా యుద్ధాన్ని కొనసాగిస్తే అంతే సంగతులు

- ఒక్కచుక్క చమురును కూడా సరఫారా కానివ్వం
- ఇరాన్ మరోమారు ఘాటు హెచ్చరికలు

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 24 :**

అమెరికా తమపై ఆర్థిక యుద్ధాన్ని కొనసాగిస్తే ఒక్క చుక్క చమురును కూడా సరఫరా కానివ్వమని ఇరాన్ హెచ్చరించింది. హోర్ముజ్ జలసంధి విషయంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇరాన్ అత్యున్నత జాతీయ భద్రతా మండలి కార్యదర్శి మొహ్సెన్ రెజాయీ ఈ హెచ్చరిక చేశారు. ఇరాన్‌పై అమెరికా కొత్త ఆర్థిక ఆంక్షలు విధించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో రెజాయీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అమెరికా ఆర్థిక యుద్ధం కొనసాగితే హోర్ముజ్ జలసంధి ద్వారా మాత్రమే కాకుండా పర్షియన్ గల్ఫ్ నుంచి కూడా ఒక్క చుక్క చమురునూ ఎగుమతి చేయనీయమని రెజాయీ హెచ్చరించారు. అమెరికా ఆర్థిక చర్యలకు మద్దతు ఇచ్చే లేదా వాటిలో భాగస్వాములయ్యే దేశాలను కూడా ఇరాన్ శత్రువులుగా పరిగణిస్తుందని రెజాయీ హెచ్చరించారు. అలాంటి దేశాలపై ప్రతీకార చర్యలు తీసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. మరోవైపు ఇరాన్‌పై అమెరికా భారీ ఆర్థిక ఆంక్షలకు సిద్ధమవుతోంది. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఈ చర్యలను 'ఎకనామిక్ డీడే'గా అభివర్ణించారు. ఇరాన్‌తో వాణిజ్యం కొనసాగించే దేశాలు, సంస్థలపై కూడా కొత్త ఆంక్షలు విధించే అవకాశం ఉందన్నారు. ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై గరిష్ఠ ఒత్తిడి తీసుకురావడమే తమ ఉద్దేశమని వాషింగ్టన్ చెబుతోంది. అయితే



ఇరాన్ మాత్రం ఈ ఆంక్షలను ఎదుర్కొంటామని స్పష్టం చేస్తోంది. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి విషయంలో ఇరాన్ ఇప్పటికే కఠిన వైఖరి అవలంబిస్తోంది. ఈ మార్గంలో నౌకల రాకపోకలు భారీగా తగ్గాయి. ఈ వారాంతంలో 20 కంటే తక్కువ వాణిజ్య నౌకలు మాత్రమే హోర్ముజ్ గుండా వెళ్లినట్లు నౌకాయాన సమాచారం వెల్లడించింది. హోర్ముజ్ ద్వారా చమురు రవాణాకు అంతరాయం ఏర్పడితే ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

## 27న గ్రామ, వార్డు సభలు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా ఈ నెల 27న రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో సమీక్ష నిర్వహించారు. సభల్లో ముసాయిదా ఓటర్ల జాబితా, ఏఎస్‌డీ జాబితాలను ప్రజలకు చదివి వినిపించాలని సూచించారు. ఫారం6, 7, 8లను అందుబాటులో ఉంచి ప్రజల అభ్యంతరాలు, సూచనలను నమోదు చేయాలని ఆదేశించారు. అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించాలని, పెండింగ్ నోటీసుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీఆర్ఓ స్వామితో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 193 దరఖాస్తులు అందగా, అత్యధికంగా నగరపాలికకు 58, గృహ నిర్మాణ శాఖకు 42 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై సీఎం క్యాంపు కార్యాలయం, సీఎస్ కార్యాలయం ప్రత్యేక దృష్టి సారించాయని కలెక్టర్ తెలిపారు. పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత లాగిన్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు.



దరఖాస్తుల పరిష్కారంలో ప్రధాన సమస్యలు ఎదురైతే ఉన్నతాధికారులను సంప్రదించి వాటిని సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## తల్లిదండ్రులను వేధించిన కుమారుల అరెస్టు

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

తల్లిదండ్రులను వేధించి, వారి ఇంట్లోని నిత్యావసర వస్తువులను అనుమతి లేకుండా తీసుకెళ్లిన కేసులో ఇద్దరు కుమారులను కేశవపట్నం పోలీసులు అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. కేశవపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని తాడికల్ గ్రామానికి చెందిన సీనియర్ సిటిజన్ వేముల అమృత (60) ఫిర్యాదు మేరకు ఆమె కుమారులు వేముల ఐలయ్య, వేముల కుమార్లపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆగస్టు 20న అమృత ఇంట్లో లేని సమయంలో నిందితులు ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించి, ఆమె అనుమతి లేకుండా ఇంట్లోని నిత్యావసర వస్తువులను తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం ఆమెను ఇంట్లోకి రానీయకుండా ఇబ్బందులకు గురిచేసినట్లు పోలీసులు తెలిపారు. హుజురాబాద్ రూరల్ సీఐ వి. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. Maintenance and Welfare of Parents and Senior Citizens Act, 2007లోని సంబంధిత నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. దర్యాప్తులో భాగంగా ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, మేజిస్ట్రేట్ 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు వెల్లడించారు. తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్లను వేధించడం, నిర్లక్ష్యం చేయడం, వారి సంరక్షణ బాధ్యతలను విస్మరించడం వంటి చర్యలను పోలీసులు ఏమాత్రం ఉపేక్షించరని సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. ఎవరైనా తల్లిదండ్రులను లేదా సీనియర్ సిటిజన్లను ఇబ్బందులకు గురిచేస్తే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. బాధ్యులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కేశవపట్నం ఎస్సై కె. శేఖర్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం తక్షణం స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఆటో, యాప్ ఆధారిత సంఘాల జేఏసీ నాయకులు కోరారు. సోమవారం శంకరపట్నం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లు సమావేశమై తమ డిమాండ్లను వెల్లడించారు. ఆర్టీసీ పరిధిలోకి ఆటోలను తీసుకురావాలనే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని కోరారు. ఆటో రవాణా రంగ కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారికి ప్రభుత్వపరంగా రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఇంధనం, నిత్యావసరాల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఆటో మీటర్ చార్జీలను సవరించాలని సూచించారు. ఓలా, ఉబర్, రాపిడో వంటి ప్రైవేట్ యాప్‌లకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్ అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. యాప్‌ల ద్వారా కొనసాగుతున్న టూవీలర్ రవాణా సేవలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో శంకరపట్నం మండలం ఆటో యూనియన్ కార్మిక సంఘం అధ్యక్షుడు సుంకర కిషోర్, ఉపాధ్యక్షుడు కొత్తపల్లి అశోక్, నాయకులు చంద్రమౌళి, ప్రశాంత్, శ్రీకాంత్, అనిల్, రవి, శ్రీను, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజాప్రతినిధికి కనీస గౌరవం ఇవ్వకపోవడం దుదృష్టకరం

- **51వ డివిజన్ కార్పొరేటర్ ఆకారపు రేఖా మహేష్**

**శెనార్తి మీడియా , రామగుండం:**

ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధికి కనీస సమాచారం ఇవ్వకుండా జేసీబీలతో వచ్చి కూల్చివేతలు చేపట్టడం సరికాదని రామగుండం నగర పాలక సంస్థ 51వ డివిజన్ కార్పొరేటర్ ఆకారపు రేఖా మహేష్ అన్నారు. ప్రజా ప్రతినిధి పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు దురదృష్టకరమని పేర్కొన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులను ఈ విషయంపై వివరణ కోరగా, "కార్పొరేటర్‌కు చెప్పాల్సిన అవసరం లేదని కమిషనర్ గారు చెప్పారని" వారు సమాధానం ఇవ్వడం



బాధాకరమన్నారు. ప్రజలకు సంబంధించిన కీలకమైన పనులు, ముఖ్యంగా ఇళ్ల కూల్చివేతలు, రోడ్డు నిర్మాణం వంటి అంశాల్లో స్థానిక ప్రజాప్రతినిధికి ముందస్తు సమాచారం ఇవ్వడంతో పాటు సమన్వయం చేసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రెండున్నర సంవత్సరాలుగా రోడ్డు నిర్మాణం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని, ముందుగా రోడ్డు నిర్మాణం ఎప్పుడు చేపడతారో అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే కూల్చివేతలతో పాటు అభివృద్ధి పనులను కూడా వేగవంతంగా చేపట్టాలని కోరారు. "ప్రజల సమస్యల కోసం ప్రశ్నించడం నా బాధ్యతని. ప్రజల తరపున ప్రశ్నించే ప్రజాప్రతినిధిని అవమానించడం మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదు" అని ఆకారపు రేఖా మహేష్ స్పష్టం చేశారు

# పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దు

- **- జీవో 97ను వెంటనే రద్దు చేయాలి**
- **బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ రావు**

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**



పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి విభాగం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకువస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 97ను వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ రావు డిమాండ్ చేశారు. జీవో 97ను రద్దు చేయాలని కోరుతూ పాలిటెక్నిక్ విద్యార్థులు, మంచిర్యాల నియోజకవర్గ బీఆర్ఎస్‌వీ నాయకులు జిల్లా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాకు ఆయన మద్దతు తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంచిర్యాల జాయింట్ కలెక్టర్ పి. చంద్రయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజిత్ రావు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 97తో పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని ఆరోపించారు. గతంలో పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసిన విద్యార్థులు ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో నేరుగా ప్రవేశం పొందే అవకాశం ఉండేదని, కొత్త నిబంధనల వల్ల ఇంజనీరింగ్ చదవాలంటే ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. దీంతో విద్యార్థులకు అదనపు సమయం, ఆర్థిక భారం పడుతుందని అన్నారు. డిప్లొమా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే జీవో 97ను రద్దు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం మొండివైఖరి అవలంబిస్తే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. విద్యార్థుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ విద్యార్థుల పక్షాన మరింత ఉధృతంగా పోరాటం చేస్తుందని తెలిపారు. అనంతరం జీవో 97ను రద్దు చేయాలని కోరుతూ జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ విద్యార్థులు, బీఆర్ఎస్‌వీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, టీబీజీకేఎస్ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రజావాణికి 10 దరఖాస్తులు

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శెనార్తి మీడియా, శంకరపట్నం: మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యలపై మొత్తం 10 దరఖాస్తులు అందాయి. మండల విద్యాధికారికి ఒకటి, పశువైద్యాధికారికి ఒకటి, మండల రెవెన్యూ అధికారికి ఆరు, ఆర్టీసీకి ఒకటి, ఎంపీవోకు ఒక దరఖాస్తు చొప్పున అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి భాగ్యలక్ష్మి, ఎంపీడీవో అనిత, ఎమ్మార్వో సురేఖ, మండల వైద్యాధికారి గొట్టె అర్జున్, పశువైద్యాధికారి మాధవరావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# మేకల మార్కెట్‌లో బురద నివారణకు చర్యలు



- **సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపిన మేకల మార్కెట్ సంఘం నాయకులు**

**శెనార్తి మీడియా, సెంటినరీ కాలనీ:**

భారీ వర్షాలతో సెంటినరీ కాలనీలోని మేకల మార్కెట్ బురదమయంగా మారడంతో సమస్య పరిష్కారానికి సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు చర్యలు చేపట్టారు. మార్కెట్‌లో బురద కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని మేకల మార్కెట్ యజమానులు సోమవారం సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన సర్పంచ్ పలు ట్రాక్టర్ ట్రిప్పుల చిప్స్‌ను మార్కెట్‌లో పోయించి బురద నివారణకు చర్యలు చేపట్టారు. దీంతో మార్కెట్‌లో రాకపోకలకు ఇబ్బందులు తగ్గాయని నిర్వాహకులు తెలిపారు. ఇదిలా ఉండగా, బుధవారం మేకల మార్కెట్‌లోని మైసమ్మ దేవాలయంలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహించనున్న నేపథ్యంలో మార్కెట్‌లో బురద సమస్యను పరిష్కరించేందుకు సర్పంచ్ ప్రత్యేక చొరవ చూపడంపై మేకల మార్కెట్ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేకల మార్కెట్ సంఘం నాయకులు ఒర్రె సురేష్, ఒర్రె సదయ్య, బనుక అంజి, బత్తిని ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



# వన మహోత్సవానికి చికెన్ సెంటర్ అడ్డంకి

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

శెనార్తి మీడియా, శంకరపట్నం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమానికి కాచాపూర్ గ్రామంలో చికెన్ సెంటర్ అడ్డంకిగా మారింది. మంగళవారం గ్రామంలో మొక్కలు నాటేందుకు గ్రామపంచాయతీ పాలకవర్గం, అధికారులు సోమవారం ఏర్పాట్లు చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వారు. అయితే రహదారిని ఆనుకుని ఓ వ్యక్తి చికెన్ సెంటర్‌తో పాటు బెల్టు షాపు నిర్వహిస్తుండటంతో మొక్కలు నాటే పనులకు ఇబ్బంది ఏర్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. రహదారిని ఆక్రమించి ఏర్పాటు చేసిన చికెన్ సెంటర్‌ను తొలగించాలని గ్రామపంచాయతీ అధికారులు గతంలోనే నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. అయినా వ్యాపారి స్పందించకపోవడంతో సోమవారం పంచాయతీ పాలకవర్గం మరోసారి అక్కడికి వెళ్లి దుకాణాన్ని తొలగించాలని సూచించింది. అయినప్పటికీ చికెన్ సెంటర్‌ను తొలగించకపోవడంతో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహణకు ఆటంకం కలుగుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు రహదారి ఆక్రమణను తొలగించి మొక్కలు నాటేందుకు అనుకూల పరిస్థితులు కల్పించాలని మండల అధికారులను కోరారు

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**శెనార్తి మీడియా, కోరుట్ల**: గుమ్లాపూర్ గ్రామంలో పేకాట స్థావరంపై కోరుట్ల ఎస్ఐ జీ శ్యామ్‌రాజ్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,63,100 నగదు, పేకముక్కలు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## విద్యార్థులకు పోషకాహారంతో కూడిన
# అల్పాహారం అందించాలి

- **కేంద్రీకృత వంటశాలను పరిశీలించిన కలెక్టర్ కుమార్ దీపక్**


**శెనార్తి మీడియా, మంచిర్యాల:**



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు హరే కృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న అల్పాహారం నాణ్యతతో, పోషక విలువలతో సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో ఏర్పాటు చేసిన కేంద్రీకృత వంటశాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహణకు హరే కృష్ణ ఫౌండేషన్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు ఉదయం వేళలో పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యంతో పాటు ఏకాగ్రత, విద్యాభ్యాసం మెరుగుపడేందుకు దోహదపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. అల్పాహారం తయారీ, నాణ్యత, పరిశుభ్రత, పంపిణీ వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు రూ.23.75 కోట్లతో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన ఈ నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# శాంతియుతంగా మిలాద్-ఉన్-నబీ

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**




మీలాద్‌ఉన్‌నబీ పండుగను శాంతియుతంగా, సోదరభావంతో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కోరారు. సోమవారం రామగుండం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన ముస్లిం మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగ భద్రతా ఏర్పాట్లు, జులూస్‌లు, ర్యాలీలు, ట్రాఫిక్ నియంత్రణపై చర్చించారు. జులూస్‌లు, ర్యాలీలకు ముందస్తు అనుమతులు తీసుకుని పోలీసుల సూచించిన మార్గాల్లోనే నిర్వహించాలని సీపీ సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నిర్వాహకులు స్వచ్ఛంద సేవకులను ఏర్పాటు చేసుకోవాలని, అధిక శబ్దంతో డీజేలు, సౌండ్ సిస్టమ్‌లు వినియోగించవద్దని తెలిపారు. చిన్నారులు, వృద్ధులు, విద్యార్థులు, ఆసుపత్రుల్లోని రోగులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఇతర మతాలు, వర్గాల మనోభావాలను గౌరవిస్తూ మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రసంగాలు, పాటలు, నినాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. యువత శాంతి, క్రమశిక్షణతో వ్యవహరించాలని, ర్యాలీల్లో మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.

**సోషల్ మీడియా పుకార్లపై అప్రమత్తంగా ఉండాలి**



సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలు, పుకార్లను నమ్మవద్దని సీపీ సూచించారు. ఇతరుల మనోభావాలను దెబ్బతీసే పోస్టులు చేయవద్దని, అనుమానాస్పద సమాచారాన్ని ఫార్వర్డ్ చేయకుండా ముందుగా పోలీసులను సంప్రదించి వాస్తవాలను నిర్ధారించుకోవాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా పోస్టులు చేసి మత ఘర్షణలకు కారణమయ్యే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పండుగ సందర్భంగా అవసరమైన పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడతామని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతరం నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు సమాచారం అందించాలని సూచించారు. అదనపు డీసీపీ కె. శ్రీనివాస్, ఏసీపీలు నాగేంద్ర గౌడ్, ఆర్. ప్రకాష్, సీఐలు, ఎస్ఐలు, పోలీసు అధికారులు, మత పెద్దలు పాల్గొన్నారు.


## పాలు తాగని దేశాలు ఏవో తెలుసా..ఎందుకంటే?



పాలల్లో సహజంగా లాక్టోజ్ అనే పదార్థం ఉంటుంది. పాల ఉత్పత్తుల్లో ఉండేది చక్కెర లాంటి పదార్థం. ఇది శరీరంలో సులభంగా జీర్ణం కాదు. దీన్నే లాక్టోజ్ టాలరెన్స్ అంటారు. అయితే పాల ఉత్పత్తులకు దూరంగా ఓ పది దేశాలు ఉన్నాయి. దక్షిణ కొరియా దేశంలో పాలకు బదులు సోయా లాంటి లాక్టోజ్ ఉత్పత్తులు వాడతారు. సోలమన్ దీవుల్లో కూడా పాలు తాగరు. వియత్నాంలో మొక్కల ద్వారా లభించే పాల పదార్థాలు తీసుకుంటారు. ఇరాన్, ఒమన్, సిరియా, ఇజ్రాయిల్, ఉజ్బెకిస్తాన్, ఇరాక్, సోమాలియాలో పాలను దాదాపు 95 శాతం మంది తాగరు. కానీ సహజ సిద్ధంగా మొక్కల ద్వారా వచ్చే లాక్టోజ్ పదార్థాలను తీసుకుంటారు.




## బ్లాక్ వాటర్ గురించి తెలుసా..?



టీం ఇండియా క్రికెటర్ విరాట్ కోహ్లీ ని ఫిట్ నెస్ రారాజు అని పిలుచుకుంటారు. అతడు చేసే వర్కౌట్ వీడియోలను సోషల్ మీడియాలో చాలా మంది గమనిస్తుంటారు. కాగా విరాట్ చాలా వరకు డైట్ పాటిస్తారు. ఫిట్ నెస్ కోసం విరాట్ నాన్ వెజ్ తినడం మానేశారు. కాగా విరాట్ కోహ్లీ బ్లాక్ వాటార్ తాగుతుంటాడు. చాలా మందికి నీటికి రంగు రుచి ఉండదనే తెలుసు. మరి బ్లాక్ వాటర్ సంగతేంటి అనుకుంటున్నారా.. ఈ బ్లాక్ వాటర్ వల్ల శరీరానికి ఎన్నో ఉపయోగాలు ఉంటాయి. దీని ధర కూడా అంతే స్థాయిలో ఉంటుంది. లీటర్ బ్లాక్ వాటర్ ధర సుమారు రూ. 600 నుంచి రూ. 3 వేల దాకా ఉంటుంది. కోహ్లీ తో పాటు బాలీవుడ్ హీరోయిన్లు ఊర్వశి రౌటేలా, మలైకా ఆరోడా, శ్రుతిహసన్ కూడా తాగుతున్నారు. ఈ నీళ్లు నల్ల రంగులో ఉంటాయి. సాధారణ నీటితో పోలిస్తే బ్లాక్ వాటర్ pH స్థాయి ఎక్కువగా ఉంటుంది. ఈ బ్లాక్ వాటర్ pH స్థాయి మాత్రం 8.5 ఉంటుంది. సాధారణ నీళ్లలో కేవలం 6 నుంచి ఏడు వరకు మాత్రమే పీహెచ్ ఉంటుంది. ఇక ఈ బ్లాక్ వాటర్‌లో 70కిపైగా మినరల్స్ ఉంటాయి. ఇది దీర్ఘకాలంలో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కలిగిస్తాయి. ఈ బ్లాక్ వాటర్‌లోని అణువులు చిన్నగా ఉంటాయి. దీంతో వీటిని మన శరీర కణాలు సులువుగా శోషిస్తాయి. అంతేకాదు ఈ బ్లాక్ వాటర్ అణువులు మన శరీర వ్యవస్థకు మనం అందించే పోషకాలను నిలుపుకోవడంలోనూ ప్రత్యేకంగా పని చేస్తాయి. కాగా ఇది ఫ్రాన్స్ లో తయారు చేస్తారని దీనిని టాప్ మోస్ట్ సెలబ్రేటీలు మాత్రమే తాగుతారని తెలుస్తోంది.

## అల్యూమినియం పాత్రల్లో వంట చేస్తున్నారా.. అయితే మీరు ప్రమాదంలో పడ్డట్లే!



ప్రస్తుత సమాజంలో అల్యూమినియం పాత్రల్లోనే అందరూ వంటలు చేసుకుంటారు. కానీ ఇందులో వంట చేసుకోవడం చాలా డేంజర్ అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా అల్యూమినియం పాత్రలు మరీ డేంజర్. ఎందుకంటే..యాసిడ్స్ కలిగిన పదార్థాలు, టమాటాలు, అలాగే పుల్లని పదార్థాలు కోసం అల్యూమినియం పాత్రలను వాడినపుడు చర్య జరిపి.. వీటి నుంచి ఎక్కువ శాతం అల్యూమినియం పదార్థాలలో కలిసి పోయే ప్రమాదం ఉంటుంది. పరిశోధనల ప్రకారం తెలిసింది ఏంటంటే.. ఒకవేళ మనం ఇంట్లో అల్యూమినియం వస్తువులను వాడాల్సి వచ్చినపుడు వాటిలో ఎక్కువ సమయం పులుపు, యాసిడ్ కలిగిన పదార్థాలు నిల్వ ఉంచకూడదు. ఎక్కువ సమయం వేడి చేయకుండా వాడుకోవాలి. అయితే కూరలు క్రోమియమ్, లెడ్, కాడ్మియమ్, నికిల్ వంటి మిగిలిన వస్తువులలో కంటె అల్యూమినియంలో ఉడికించేటప్పుడు మూడింతలు ఎక్కువ కరిగి పదార్థాలతో కలిసే అవకాశం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు అల్యూమినియం పాత్రల్లో వంట చేయటం వల్ల, బ్రెయిన్‌లోని క్రోమాటిక్ నెట్ వర్క్ పైన ప్రభావం పడి, బ్రెయిన్ సెల్స్ డామేజ్ అయ్యే అవకాశం ఉందని వైద్య పరిశోధనల్లో రుజువైంది. అల్యూమినియం చేసే హాని నుంచి బయటపడాలంటే ఎనొడైజ్డ్ అల్యూమినియం పాత్రలను వాడుకోవాలి. ఈ ఎనొడైజ్డ్ మెటల్‌తో తయారు చేసిన పాత్రలు, పాన్‌లు కూడా త్వరగా వేడెక్కడమే కాక, మన్నిక కూడా ఎక్కువకాలం ఉంటుంది. దానితో పాటు గీతలు పడకుండా, శుభ్రం చేసుకునేందుకు కూడా సులువుగా ఉంటాయి. ఈ ఎనొడైజ్డ్ అల్యూమినియం పాత్రలలో పదార్థాలు వండటం వల్ల అల్యూమినియం పదార్థాలలో కలిసే ప్రమాదం అంతగా లేదని పరిశోధకులు చెప్తున్నారు. ఈ క్రమంలోనే బాగా బాయిల్ చేసి వండే ఏ వంటకాన్నైనా అల్యూమినియం పాత్రల్ని వాడకపోవటమే మంచిదంటున్నారు.

# కొలంబో టెస్టుకు వరుణుడి బ్రేక్

- భారత ఇన్నింగ్స్‌కు వర్షం అంతరాయం
- ఆట నిలిచేసరికి భారత్ 475/8
- 95 పరుగులతో శతకానికి చేరువలో ధ్రువ్ జురెల్
- రిషభ్ పంత్ మెరుపులు.. 63 పరుగులతో కీలక ఇన్నింగ్స్




**కొలంబో:** భారత్–శ్రీలంక రెండో టెస్టుకు వరుణుడు అడ్డుపడ్డాడు. రెండో రోజు టీ విరామానికి ముందే ఆకాశం మేఘావృతమై కొద్దిసేపటికే వర్షం మొదలైంది. దీంతో అంపైర్లు ఆటను నిలిపివేశారు. అప్పటికి భారత్ ఎనిమిది వికెట్ల నష్టానికి 475 పరుగులతో భారీ స్కోరు సాధించింది. ధ్రువ్ జురెల్ 95 పరుగులతో అజేయంగా నిలిచి శతకానికి చేరువయ్యాడు. ఓవర్‌నైట్ స్కోరు 300/5తో రెండో రోజు ఆట ప్రారంభించిన భారత్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. అరంగేట్ర ఆటగాడు సరాన్ష్ జైన్ 6 పరుగులకే వెనుదిరిగాడు. తొలి రోజు రిటైర్డ్ హర్ట్‌గా మైదానాన్ని వీడిన రిషభ్ పంత్ తిరిగి క్రీజులోకి వచ్చి తనదైన శైలిలో శ్రీలంక బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ధ్రువ్ జురెల్‌తో కలిసి కీలక భాగస్వామ్యాన్ని నిర్మించాడు. పంత్ టెస్టుల్లో తన 21వ అర్ధశతకాన్ని నమోదు చేసి 63 పరుగులతో ఔటయ్యాడు. మరోవైపు జురెల్ నిలకడగా ఆడుతూ ప్రభాత్ జయసూర్య బౌలింగ్‌లో బౌండరీతో అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. టెస్టుల్లో జురెల్‌కు ఇది మూడో అర్ధశతకం. పంత్–జురెల్ జోడీ శతక భాగస్వామ్యంతో భారత్‌ను భారీ స్కోరు దిశగా నడిపించింది. లంచ్ సమయానికి భారత్ ఆరు వికెట్లకు 419 పరుగులు చేసింది. భోజన విరామం అనంతరం తొలి బంతికే పంత్ వెనుదిరిగినా జురెల్ మాత్రం పట్టువదల్లేదు. మానవ్ సుతార్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. అసిత ఫెర్నాండో బౌలింగ్‌లో బౌండరీ సాధించి 95 పరుగులకు చేరుకున్న జురెల్ తొలి టెస్టు శతకానికి కేవలం ఐదు పరుగుల దూరంలో నిలిచాడు. అదే సమయంలో కొలంబోలో మబ్బులు దట్టంగా కమ్ముకోవడంతో అంపైర్లు టీ విరామాన్ని ముందుగానే ప్రకటించారు. అనంతరం వర్షం మొదలవడంతో ఆటకు అంతరాయం ఏర్పడింది. జురెల్ శతకం పూర్తి చేసిన తర్వాత భారత్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసే అవకాశముండటంతో ఆట పునఃప్రారంభంపై ఆసక్తి నెలకొంది.




## పంత్ భారీ సిక్సర్.. ముక్కలైన స్టేడియం పైకప్పు అద్దం!

**కొలంబో:** కొలంబో టెస్టులో రిషభ్ పంత్ తన మార్క్ విధ్వంసం చూపించాడు. మణికట్టు గాయం నొప్పిని భరిస్తూనే కీలక ఇన్నింగ్స్ ఆడిన పంత్ మెరుపు అర్ధ శతకంతో జట్టు భారీ స్కోర్‌లో భాగమయ్యాడు. తన తుఫాన్ ఇన్నింగ్స్‌తో శ్రీలంక బౌలర్లను హడలెత్తించిన ఈ చిచ్చరపిడుగు.. స్టేడియం పైకప్పు అద్దాన్ని సైతం పగలగొట్టాడు. శ్రీలంక పర్యటనలో భాగంగా కొలంబోలో జరుగుతున్న రెండో టెస్టులో భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ చెలరేగాడు. ఎడాపెడా బౌండరీలతో శ్రీలంక బౌలర్లను బెంబేలెత్తించిన పంత్ .. స్టేడియం పైకప్పు అద్దాన్ని ముక్కలు చేశాడు. రెండో రోజు తొలి సెషన్‌లోనే సరాన్ష్ జైన్ ఔటయ్యాక బ్యాటింగ్‌కు వచ్చిన ఈ పంత్.. 90వ ఓవర్లో భారీ సిక్సర్ బాదాడు. లహిరు కుమార సంధించిన బంతిని ఫైన్ లెగ్‌లో పంత్ బాదేయగా.. బంతి నేరుగా వెళ్లి స్టేడియం పైకప్పు మీదపడింది. 95 మీటర్ల ఆ సిక్సర్ ధాటికి అక్కడి సోలార్ రూఫ్ అద్దం పగిలిపోయింది. దాంతో.. లంక ఆటగాళ్లే కాదు కామెంటర్లు, ప్రేక్షకులు షాకయ్యారు. ఇక కామెంటేటర్ రస్సెల్ ఆర్నాల్డ్ అయితే పంత్ ధాటికి స్టేడియంలో ఏసీలు పనిచేయడం లేదు అని జోక్ చేశాడు.





### శతక భాగస్వామ్యం

తొలి సెషన్‌లో లంకబౌలర్లను ఉతికారేసిన పంత్ టెస్టుల్లో 21వ హాఫ్ సెంచరీ సాధించాడు. అంతేకాదు టెస్టుల్లో అత్యధిక పరుగుల చేసిన భారత వికెట్ కీపర్‌గా ఎంఎస్ ధోనీ రికార్డును బ్రేక్ చేశాడు. ధ్రువ్ జురెల్‌తో కలిసి అతడు శతక భాగస్వామ్యం నెలకొల్పాడు. ఫలితంగా లంచ్ బ్రేక్ సమయానికి భారత్ 6 వికెట్ల నష్టానికి 419 రన్స్ చేసింది. అయితే.. భోజన విరామానికి 63 పరుగులతో ఉన్న పంత్ తర్వాత మొదటి బంతికే ఔటయ్యాడు.

## 140 ఏళ్లలో ఇదే తొలిసారి..

### ఓటమిలోనూ చరిత్ర సృష్టించిన షరీఫుల్!



- ఆస్ట్రేలియాపై బంగ్లా పేసర్ సంచలనం
- 15 ఓవర్లలో 48 పరుగులిచ్చి ఏడు వికెట్లు
- అయినా బంగ్లాదేశ్‌కు ఇన్నింగ్స్ ఓటమి
- రెండు టెస్టుల సిరీస్ 1-1తో సమం

**మాకే:** ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టెస్టులో బంగ్లాదేశ్ ఘోర పరాజయం పాలైనా.. ఆ జట్టు స్టార్ పేసర్ షరీఫుల్ ఇస్లాం మాత్రం చరిత్ర పుటల్లోకి ఎక్కాడు. ఏకంగా 140 ఏళ్లుగా సాధ్యం కాని అరుదైన ఘనతను అందుకుని ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షించాడు. ఆస్ట్రేలియాపై టెస్టు ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లు పడగొట్టిన తొలి ఎడమచేతి పేసర్‌గా షరీఫుల్ అరుదైన రికార్డు నెలకొల్పాడు. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో షరీఫుల్ నిప్పులు చెరిగాడు. 15 ఓవర్లు బౌలింగ్ చేసి కేవలం 48 పరుగులిచ్చి ఏడు వికెట్లు పడగొట్టాడు. అతడి ధాటికి ఆసీస్ బ్యాటింగ్ విభాగం తడబడింది. చివరకు ఆస్ట్రేలియా 210 పరుగులకు ఆలౌటైంది.దఆస్ట్రేలియాతో టెస్టులో ఎడమచేతి పేసర్ ఒక ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లు పడగొట్టడం 140 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. 1886లో ఇంగ్లండ్‌కు చెందిన డిక్ బార్లో మాంచెస్టర్ టెస్టులో 44 పరుగులిచ్చి ఏడు వికెట్లు పడగొట్టాడు. ఆ తర్వాత ఇన్నేళ్లకు షరీఫుల్ ఆ ఘనతను అందుకున్నాడు. ఆస్ట్రేలియాపై టెస్టు ఇన్నింగ్స్‌లో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన రికార్డు మాత్రం ఇంగ్లండ్ దిగ్గజ స్పిన్నర్ జిమ్ లేకర్ పేరిట ఉంది. 1956 మాంచెస్టర్ టెస్టులో ఆయన 53 పరుగులిచ్చి మొత్తం పది వికెట్లను నేలకూల్చి చరిత్ర సృష్టించాడు.

### షరీఫుల్ మెరిసినా.. బంగ్లా కుప్పకూలింది

బౌలింగ్‌లో షరీఫుల్ అద్భుతం చేసినా బంగ్లాదేశ్ బ్యాటర్లు మాత్రం పూర్తిగా చేతులెత్తేశారు. తొలి ఇన్నింగ్స్‌లో 34 ఓవర్లలో 64 పరుగులకే ఆలౌటైన బంగ్లా.. రెండో ఇన్నింగ్స్‌లోనూ 38.3 ఓవర్లలో 95 పరుగులకే కుప్పకూలింది. ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి పది వికెట్లు పడగొట్టి బంగ్లా పతనాన్ని శాసించాడు. ఫలితంగా ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ 51 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలి టెస్టులో బంగ్లాదేశ్ సంచలన విజయం సాధించగా.. రెండో టెస్టును ఆసీస్ గెలుచుకోవడంతో రెండు మ్యాచ్‌ల సిరీస్ 1-1తో సవ-ంమైంది.

### ర్యాంకింగ్స్‌లోనూ బంగ్లా కొత్త చరిత్ర

సిరీస్ అనంతరం బంగ్లాదేశ్‌కు మరో అరుదైన ఘనత దక్కింది. తాజా టెస్టు ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు ఎగబాకి ఆరో స్థానానికి చేరుకుంది. 78 రేటింగ్ పాయింట్లతో వెస్టిండీస్, పాకిస్థాన్, శ్రీలంకలను వెనక్కి నెట్టి ఆరో స్థానంలో నిలిచింది. టెస్టు ర్యాంకింగ్స్‌లో బంగ్లాదేశ్ తొమ్మిదో స్థానం కంటే పైకి రావడం ఇదే తొలిసారి.




## అమ్మాయిలదీ అదే కథ

**అమ్‌స్టెల్వీన్:** హాకీ ప్రనపంచకప్‌లో భారత మహిళల జట్టు ప్రస్థానం ముగిసింది. నెదర్లాండ్స్ చేతిలో పురుషుల జట్టు ఓటమి బాధ మరువక ముందే అమ్మాయిల పోరాటమూ రెండో దశలోనే ఆగిపోయింది. పూల్ 'ఈ'లో భాగంగా ఆడిన మూడు మ్యాచుల్లో రెండు డ్రా చేసుకుని ఒకదాంట్లో ఓడిన సలీమ సేన.. ఆదివారం ఆస్ట్రేలియాతో గేమ్‌నూ డ్రాగానే ముగించింది. ఈ మ్యాచ్‌లో గెలిచి సెమీస్‌కు చేరాలన్న 52 ఏండ్ల నిరీక్షణకు తెరదించాలని యత్నించిన భారత్‌కు మరోసారి నిరాశే ఎదురవగా ఆస్ట్రేలియా సెమీస్‌కు అర్హత సాధించింది. మ్యాచ్‌లో పలుమార్లు పెనాల్టీ కార్నర్‌లు లభించినా వాటిని గోల్స్‌గా మలచడంలో రెండు జట్లూ విఫలమయ్యాయి. ఇదిలాఉండగా ఇప్పటికే సెమీస్ ఆశలు గల్లంతైన వేళ భారత పురుషుల జట్టు అర్జెంటీనాతో కీలక మ్యాచ్ ఆడనుంది. ఈ టోర్నీ సెమీస్ రేసులో నిలవాలంటే ఇతర సమీకరణాలకు తోడు హర్మన్‌ప్రీత్ సేన ఈ మ్యాచ్‌లో భారీ గోల్స్ తేడాతో విజయం సాధించాల్సి ఉంది.

## జైస్వాల్‌కు ఐసీసీ షాక్!

### లంక పేసర్‌తో వాగ్వాదం.. మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత

### అసిత ఫెర్నాండోకూ అదే శిక్ష

- ఇద్దరి ఖాతాలో ఒక్కో డీమెరిట్ పాయింట్
- తలలు దగ్గరకు రావడంతో జైస్వాల్ హెల్మెట్ తాకిన ఘటన
- తప్పు అంగీకరించడంతో విచారణ లేకుండానే శిక్ష ఖరారు

**కొలంబో:** శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో మైదానంలో సహనం కోల్పోయిన భారత ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు అంతర్జాతీయ క్రికెట్ మండలి షాక్ ఇచ్చింది. శ్రీలంక పేసర్ అసిత ఫెర్నాండోతో వాగ్వాదానికి దిగిన ఘటనను తీవ్రంగా పరిగణించిన ఐసీసీ.. ఇద్దరికీ మ్యాచ్ ఫీజులో 25 శాతం చొప్పున జరిమానా విధించింది. అంతేకాకుండా ఇద్దరి క్రమశిక్షణ రికార్డుల్లో ఒక్కో డీమెరిట్ పాయింట్‌ను చేర్చింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 17వ ఓవర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. అసిత ఫెర్నాండో బౌలింగ్‌లో జైస్వాల్ ఔటయ్యాడు. శ్రీలంక ఆటగాళ్లు వికెట్‌ను సంబరంగా జరుపుకుంటుండగా జైస్వాల్ పెవిలియన్ వైపు వెళ్తున్న సమయంలో ఫెర్నాండో ఏవో వ్యాఖ్యలు చేయడంతో పరిస్థితి వేడెక్కింది. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి పరస్పరం ఎదురెదురుగా వచ్చారు. ఈ క్రమంలో ఫెర్నాండో తన తలను జైస్వాల్ వైపు తీసుకురాగా.. జైస్వాల్ కూడా ముందుకు వంగడంతో అతడి హెల్మెట్ ఫెర్నాండో నుదిటిని తాకింది. పరిస్థితి మరింత ముదరకముందే శ్రీలంక కెప్టెన్ ధనంజయ డిసిల్వాతో పాటు ఇతర ఆటగాళ్లు జోక్యం చేసుకుని ఇద్దరినీ విడదీశారు.

### ఇద్దరికీ ఒకే శిక్ష

ఈ ఘటనను ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.12 ఉల్లంఘనగా మ్యాచ్ అధికారులు పరిగణించారు. అంతర్జాతీయ మ్యాచ్ సందర్భంగా ఆటగాడు, అంపైర్, మ్యాచ్ రిఫరీ లేదా ఇతర వ్యక్తితో అనుచిత శారీరక స్పర్శకు దిగడాన్ని ఈ నిబంధన నిషేధిస్తుంది. మైదాన అంపైర్లు అహ్సన్ రజా, షర్ఫుద్దౌలా ఇబ్నే షాహిద్, మూడో అంపైర్ రాడ్ టక్కర్, నాలుగో అంపైర్ ప్రగీత్ రాంబుక్వెల్లా అభియోగాలు మోపారు. జైస్వాల్, ఫెర్నాండో తమ తప్పును అంగీకరించడంతో మ్యాచ్ రిఫరీ ఆండీ పైక్రాఫ్ట్ ప్రతిపాదించిన శిక్షను ఇద్దరూ అంగీకరించారు. దీంతో ప్రత్యేక విచారణ అవసరం లేకుండా పోయింది.

### మరోసారి తప్పితే చిక్కులే!

గత 24 నెలల్లో జైస్వాల్, ఫెర్నాండోకు ఎలాంటి క్రమశిక్షణ ఉల్లంఘనల రికార్డు లేకపోవడంతో దీన్ని తొలి తప్పిదంగా పరిగణించారు. లెవల్–1 ఉల్లంఘనకు అధికారిక హెచ్చరిక నుంచి మ్యాచ్ ఫీజులో గరిష్ఠంగా 50 శాతం వరకు జరిమానాతో పాటు ఒకటి లేదా రెండు డీమెరిట్ పాయింట్లు విధించే అవకాశం ఉంటుంది. ఐసీసీ నిబంధనల ప్రకారం 24 నెలల వ్యవధిలో నాలుగు లేదా అంతకంటే ఎక్కువ డీమెరిట్ పాయింట్లు చేరితే అవి సస్పెన్షన్ పాయింట్లుగా మారతాయి. దీంతో మ్యాచ్‌ల నిషేధం ఎదురయ్యే ప్రమాదమూ ఉంటుంది. తాజా ఘటనతో జైస్వాల్, ఫెర్నాండో ఖాతాల్లో ఒక్కో డీమెరిట్ పాయింట్ చేరింది.






# మహాకాళిలో శుక్రాచార్యుడి పాత్ర పరిచయం

బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా శుక్రాచార్యుడిగా కనిపించనున్న చిత్రం 'మహాకాళి' సినిమాకు పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో శుక్రాచార్యుడి పాత్రను పరిచయం చేస్తూ 'శుక్రాచార్య వార్ క్రై' అనే క్యాప్షన్‌తో ఓ పవర్‌ఫుల్ వీడియోను పంచుకున్నారు. ఇందులో శ్రియా రెడ్డి మహాకాళిగా నటించారు. వచ్చే ఏడాది జనవరి 8న ఈ సినిమా విడుదల కానున్నట్లు టీమ్ తెలిపింది. 'హను మాన్'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ.. తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో భారీ మైథలాజికల్ ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. అదే 'మహాకాళి'. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, క్యారెక్టర్ లుక్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచగా.. తాజాగా విడుదలైన గ్లింప్స్ ఆ హైప్‌ను మరింత పదింతలు చేసింది. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఫీమేల్ సూపర్ హీరో మైథలాజికల్ ఎపిక్‌గా 'మహాకాళి' రూపొందుతోంది. 'మహాకాళి' గ్లింప్స్‌తో గూస్‌బంప్స్.. శుక్రాచార్యుడి వార్ క్రైతో పాన్ ఇండియా సంచలనం! 'హను మాన్'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ.. తన సినిమాటిక్ యూనివర్స్ నుంచి మరో భారీ మైథలాజికల్ ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. అదే 'మహాకాళి'. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, క్యారెక్టర్ లుక్స్ సినిమాపై భారీ అంచనాలు పెంచగా.. తాజాగా విడుదలైన గ్లింప్స్ ఆ హైప్‌ను మరింత పదింతలు చేసింది. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఫీమేల్ సూపర్ హీరో మైథలాజికల్ ఎపిక్‌గా 'మహాకాళి' రూపొందుతోంది. తాజాగా 'శుక్రాచార్య వార్ క్రై' పేరుతో విడుదల చేసిన వీడియో ఆద్యంతం గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది. ఓ అమ్మవారి ఆలయంలో పసిబిడ్డను వదిలివేయడంతో గ్లింప్స్ ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి కథ రాక్షసుల రాజగురువైన శుక్రాచార్యుడు చేసే భీకర తపస్సు, ఆయన ప్రతీకార సంకల్పం వైపు సాగుతుంది.క్షీరసాగర మథనం సమయంలో రాక్షసులకు అమృతం దక్కకుండా చేసి, రాక్షస జాతి వినాశనానికి కారణమైన శ్రీ మహావిష్ణువుపై శుక్రాచార్యుడు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు గ్లింప్స్‌లో చూపించారు. శుక్రాచార్యుడి పాత్రలో బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా పవర్‌ఫుల్‌గా కనిపించారు. కేవలం 14 రోజుల్లో అసుర విజయ ఘోష సమస్త బ్రహ్మాండంలో ప్రతిధ్వనించేలా చేస్తానంటూ ఆయన చేసే ప్రతిజ్ఞ కథపై మరింత ఆసక్తిని పెంచుతోంది. అసలు ఆ 14 రోజుల ప్లాన్ ఏమిటి? రాక్షసుల విజయానికి శుక్రాచార్యుడు ఎలాంటి శక్తులను ఉపయోగించబోతున్నాడు? అతని భీకర సంకల్పాన్ని అడ్డుకోవడానికి మహాకాళి ఎలా అవతరిస్తుంది? అనే ప్రశ్నలను గ్లింప్స్ ప్రేక్షకుల ముందుంచింది. గ్లింప్స్‌లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది మహాకాళి రౌద్ర రూపం. నల్లని వర్ణం, ముక్కుపుడక, ఉగ్ర స్వరూపంతో అమ్మవారిని అత్యంత శక్తిమంతంగా చూపించారు.

# వారణాసిపై మరో సంచలన వార్త

## వివిధ భాషల కోసం 1600 మంది డబ్బింగ్ ఆర్టిస్టులు




దర్శకధీరుడు ఎస్‌ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ అడ్వెంచర్ మూవీ 'వారణాసి' పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దాదాపు రూ. 1,400 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించి తాజాగా ఓ ఆసక్తికరమైన విషయం బయటకు వచ్చింది. 'వారణాసి'ని ప్రపంచవ్యాప్తంగా 120కి పైగా దేశాల్లో, 50కి పైగా అంతర్జాతీయ, ప్రాంతీయ భాషల్లో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే ఇంత భారీ స్థాయిలో సినిమాను వివిధ భాషల్లోకి తీసుకెళ్లే విషయంలో రాజమౌళి ప్రత్యేకమైన విధానాన్ని ఎంచుకున్నారట. ప్రస్తుతం సినిమాల డబ్బింగ్ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, వాయిస్ క్లోనింగ్ వంటి టెక్నాలజీలను ఉపయోగించడం పెరుగుతోంది. అయితే 'వారణాసి' విషయంలో మాత్రం రాజమౌళి ఈ విధానానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. నటీనటుల గొంతులోని సహజత్వం, భావోద్వేగాలు, డైలాగ్ డెలివరీలోని తీవ్రత ప్రతి భాషలోనూ ప్రేక్షకులకు సరిగ్గా చేరాలంటే స్థానిక ప్రొఫెషనల్ డబ్బింగ్ ఆర్టిస్టులే కీలకమని రాజమౌళి భావిస్తున్నారట. అందుకే ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1600 మందికి పైగా డబ్బింగ్ ఆర్టిస్టులను రంగంలోకి దించుతున్నట్లు సమాచారం. ఆయా భాషలకు సంబంధించిన ఉచ్చారణ, స్థానిక యాస, సంస్కృతికి అనుగుణంగా డైలాగ్స్‌ను రికార్డ్ చేయనున్నారని తెలుస్తోంది. మహేష్ బాబు, ప్రియాంక చోప్రా వంటి ప్రధాన నటుల నటనలోని ఎమోషన్ ఏ భాషలో చూసినా ప్రేక్షకులకు సహజంగా అనిపించేలా ఈ డబ్బింగ్ ప్రక్రియను డిజైన్ చేస్తున్నారట. 50కి పైగా భాషల్లో ఇంత భారీ సంఖ్యలో డబ్బింగ్ ఆర్టిస్టులతో పనిచేయడం భారతీయ సినిమా స్థాయిలో అరుదైన ప్రయత్నంగా మారనుంది. వారణాసి కథాంశం కూడా అత్యంత ఆసక్తికరంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. భూమిని ఢీకొట్టేందుకు దూసుకొస్తున్న ఓ భారీ ఉల్క వల్ల ఏర్పడే ప్రమాదం నుంచి వారణాసితో పాటు ప్రపంచాన్ని రక్షించే సాహసోపేతమైన కథతో ఈ సినిమా సాగుతుందని సమాచారం. మహేష్ బాబు ఇందులో 'రుద్ర' అనే పాత్రలో కనిపించనుండగా.. కథలో భాగంగా వివిధ కాలాల మధ్య ప్రయాణించే సాహసికుడిగా ఆయన పాత్ర ఉండబోతుందని టాక్. భారతీయ పురాణాలు, సనాతన సంస్కృతి అంశాలను ఆధునిక గ్లోబల్ అడ్వెంచర్ కథతో కలిపి రాజమౌళి ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. 'వారణాసి' షూటింగ్ ఇప్పటికే హైదరాబాద్, ఒడిశా, ఆఫ్రికాలోని కెన్యా తదితర ప్రాంతాల్లో జరిగింది. అంతేకాదు.. అంటార్కిటికాలో షూటింగ్ జరుపుకున్న తొలి భారతీయ చిత్రంగా ఈ సినిమా ప్రత్యేక గుర్తింపు దక్కించుకుంది.



# రాకాలో ఐశ్వర్యలక్ష్మి

## నెగెటివ్ షేడ్ అంటూ ప్రచారం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'రాకా' పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. భారీ బడ్జెట్‌తో, అంతర్జాతీయ స్థాయి టెక్నీషియన్స్‌తో రూపొందుతున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. తాజాగా ఈ సినిమాలో నటి ఐశ్వర్య లక్ష్మి కూడా కీలక పాత్రలో కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, 'రాకా'లో ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా కాకుండా విభిన్నమైన, ప్రాధాన్యత ఉన్న పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది.




ముఖ్యంగా ఆమె పాత్రలో నెగిటివ్ షేడ్స్ ఉంటాయని సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. అయితే ఆమె పాత్ర ఎలా ఉంటుంది? అల్లు అర్జున్ పాత్రతో ఆమెకు ఉన్న సంబంధం ఏమిటి? అనే విషయాలపై చిత్రబృందం ఇంకా ఎలాంటి అధికారిక వివరాలు వెల్లడించలేదు. ప్రస్తుతం ముంబైలో ఈ చిత్ర షూటింగ్ జరుగుతుండగా, త్వరలోనే ఐశ్వర్య లక్ష్మి కూడా షూటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. ఆమె పాత్రకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో బయటకు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ భారీ ప్రాజెక్టులో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఆమెతో పాటు టాలెంటెడ్ నటి మృణాల్ ఠాకూర్, యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ కూడా సినిమాలో కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇలా ఒకే సినిమాలో పలువురు ప్రముఖ హీరోయిన్లు భాగం కావడం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. అయితే ఈ నటీనటుల పాత్రలపై చిత్రబృందం నుంచి పూర్తి స్థాయి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 'రాకా' కథ మాఫియా నేపథ్యంలో సాగుతుందని ప్రచారం జరుగుతోంది. ఓ పవర్‌ఫుల్ డాన్ చుట్టూ తిరిగే ఈ కథలో అల్లు అర్జున్ అత్యంత స్టైలిష్, మాస్ అవతార్‌లో కనిపించనున్నారని టాక్. ముఖ్యంగా అట్లీ సినిమాల ప్రత్యేకతగా నిలిచే భారీ యాక్షన్ ఎపిసోడ్స్ ఈ చిత్రంలో ప్రధాన ఆకర్షణగా ఉంటాయని తెలుస్తోంది.

Printed, Published and Owned by **V SAMPATH**, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. **Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146** Email: shenarthimedia@gmail.com. Phone No: **9391343644**